మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

నేటి
# ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

శనివారం SATURDAY 24-1-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 205 Issue: 205

24 జనవరి 2026 - శనివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:53 సూర్యాస్తమయం - సా. 6:03 తిథి షష్ఠి రా. 12:37o వరకు తరువాత సప్తమి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం ఉత్తరాభాద్ర మ. 2:04 వరకు తరువాత రేవతి యోగం శివ మ. 1:52 వరకు కరణం కౌలవ మ. 1:13 వరకు తైతుల రా. 12:37o వరకు వర్జ్యం రా. 1:55 నుండి తె. 3:28 వరకు దుర్ముహూర్తం ఉ. 8:22 నుండి ఉ. 9:07 వరకు రాహుకాలం ఉ. 9:40 నుండి ఉ. 11:04 వరకు యమగండం మ. 1:52 నుండి మ. 3:15 వరకు గుళికాకాలం ఉ. 6:53 నుండి ఉ. 8:16 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:17 నుండి ఉ. 6:05 వరకు అమృత ఘడియలు ఉ. 9:30 నుండి ఉ. 11:05 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:05 నుండి మ. 12:50 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com

# లీకుల వంట

## తప్పుడు కథనాలతో వార్తల వడ్డన

### ప్రజల దృష్టి మరల్చేందుకు డ్రామాలు.. రేవంత్ సర్కారుపై కేటీఆర్ మండిపాటు

ఫోన్ ట్యాపింగ్ కేసులో తప్పుడు లీకులతో తమపై వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ ఆయనను సిట్ అధికారులు శుక్రవారం విచారణ జరిపారు. సుమారుగా 7 గంటలకు పైగా ప్రశ్నించారు. అనంతరం తెలంగాణ భవన్‌కు చేరుకున్న తర్వాత మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. సిట్ అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చానని తెలిపారు. ప్రజల దృష్టి మరల్చేందుకే ఈ డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు.



హైదరాబాద్, జనవరి 23 (ఈవార్తలు): విచారణ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆగ్రహించారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. లీకులతో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఫైర్ అయ్యారు. లీకులతో తమకు సంబంధం లేదని అధికారులు చెబుతున్నారని - 2 వ పేజీలో...

# కేటీఆర్ ట్యాపింగ్ దొంగ

## కేంద్రమంత్రి బండి సంజయ్ ధ్వజం



కరీంనగర్, జనవరి 23 (ఈవార్తలు): ఫోన్ ట్యాపింగ్ తోపాటు అనేక అవినీతి, అక్రమాలు, అరాచకాలకు పాల్పడినప్పటికీ కేసీఆర్ కుటుంబాన్ని టచ్ చేసే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి లేనేలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పౌరుషం లేదని... చేతులు ముడుచుకుని కూర్చున్న తరువాయి 2 వ పేజీలో...





# ట్యాపింగ్.. ...తప్పేం కాదు!

### ప్రజా భద్రత కోసం ఫోన్ ట్యాపింగ్‌కు చట్టం అనుమతి

..షరతులు వర్తిస్తాయి

తెలుగునాట ఏ నోట విన్నా ఫోన్ ట్యాపింగ్ అంశమే హాట్ టాపిక్. మొన్నటికి మొన్న తెలంగాణ మాజీమంత్రి హరీశ్ రావును సిట్ అధికారులు విచారించగా, శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సిట్ అధికారులు విచారించారు. మరి.. ఫోన్ ట్యాపింగ్ అనేది అంత పెద్ద నేరమా గతంలో ఎవరూ ట్యాపింగ్ చేయలేదా చేస్తే ఏయే సందర్భాల్లో ట్యాపింగ్‌కు అనుమతి ఉంది సుప్రీం కోర్టు ఏం చెప్తోంది అనధికారిక ఫోన్ ట్యాపింగ్‌కు పడే శిక్షలు ఏంటి అన్న అంశాలే ఇప్పుడు ప్రధానంగా మారాయి.

PHONE TAPPING


### ఒకసారి ట్యాపింగ్ అప్రూవల్స్‌కు 2 నెలల గడువు

### గరిష్ఠంగా 6 నెలల వరకు పొడిగించే అవకాశం

### అనధికారిక ఫోన్ ట్యాపింగ్‌కు మూడేళ్ల జైలుశిక్ష

(ఈవార్తలు-స్పెషల్ డెస్క్)

భారత్‌లో ఫోన్ ట్యాపింగ్ అనేది కొన్ని ప్రత్యేక నిబంధనలకు లోబడి మాత్రమే చట్టబద్ధం. అనుమతి లేకుండా లేదా నిబంధనలు అతిక్రమించి ఫోన్ ట్యాపింగ్ చేయడం శిక్షార్హమైన నేరం. ఫోన్ ట్యాపింగ్‌కు కేంద్ర స్థాయిలో కేంద్ర హోం సెక్రటరీ లేదా రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర హోం సెక్రటరీ నుండి కచ్చితమైన ముందస్తు అనుమతి అవసరం. అత్యవసర పరిస్థితుల్లో తప్ప, జాయింట్ సెక్రటరీ స్థాయి కంటే తక్కువ అధికారులకు ఈ అధికారం ఉండదు. ప్రజా అత్యవసర పరిస్థితి, లేదా ప్రజా భద్రత దృష్ట్యా మాత్రమే ఫోన్ ట్యాపింగ్ చేయడానికి చట్టం అనుమతిస్తుంది. దేశ సార్వభౌమాధికారం, సమగ్రత, విదేశాలతో స్నేహ సంబంధాలు దెబ్బతినకుండా ఉండేందుకు లేదా నేరాలను నిరోధించడానికి దీనిని ఉపయోగిస్తారు. అయితే, వ్యక్తిగత గోప్యత హక్కును ఉల్లంఘించడం నేరం అని సుప్రీంకోర్టు చెప్పింది. పుట్టస్వామి కేసు-2017 ప్రకారం, ప్రైవసీ (గోప్యత) అనేది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. చట్టబద్ధమైన విధానం లేకుండా ఫోన్ ట్యాపింగ్ చేయడం ఈ హక్కును ఉల్లంఘించడమే అవుతుంది. ఒకసారి ఇచ్చిన ట్యాపింగ్ అనుమతి 2 నెలల వరకు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. దీనిని గరిష్టంగా 6 నెలల వరకు పొడిగించవచ్చు, అంతకు మించి అనుమతించరు. ప్రతి ట్యాపింగ్ ఆర్డర్‌ను కేబినెట్ సెక్రటరీ నేతృత్వంలోని సమీక్ష కమిటీ తరువాయి 2 వ పేజీలో..



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,715 |
| వెండి (గ్రాము): | రూ.360 |
| ప్లాటినం (గ్రాము): | రూ.7,804 |

## విశ్వవాణి



వెదురు మొలకలు అత్యంత శక్తివంతమైన ఆహారం అని మీకు తెలుసా? అందులో కొవ్వు తక్కువగా ఉండి, ఫైబర్, ప్రొటీన్, విటమిన్లు, మినరల్స్ అధికంగా ఉంటాయి. జీవక్రియ మెరుగుపరుచుకొనేందుకు, సమతుల్య ఆహారం కోసం చూసేవాళ్లకు వెదురు మొలకలు మంచివట.



# సజ్జనార్‌పై 7 కేసులు

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

రేవంత్‌రెడ్డి రాజకీయ క్రీడలో పోలీసులు బలికావద్దని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశ భద్రత కోసం, రాష్ట్ర భద్రత కోసం ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఒక పోలీస్ అధికారిగా ఫోన్ ట్యాపింగ్ విషయం తనకు తెలుసని.. అత్యంత గోప్యంగా ఉంచాల్సిన ఈ అంశాన్ని.. రేవంత్‌రెడ్డి బజారున పడేశారన్నారు.

హైదరాబాద్, జనవరి 23 (ఈవార్తలు): తెలంగాణ సంపదను పక్క రాష్ట్రాలకు రేవంత్ కట్టబెడుతున్నారని.. దీనిపై కేటీఆర్, హరీశ్‌రావు వీరోచితంగా పోరాటం చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ సంపదను నైనీ కోల్డ్ బ్లాక్ దోచుకుంటున్నదని.. దీనిపై బీఆర్ఎస్ మాట్లాడితే డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ పార్టీ కూల్చివేసిందని.. దీన్ని డైవర్ట్ చేసేందుకు కమిషన్ వేశారని అన్నారు. ప్రమోషన్ల కోసం రేవంత్‌రెడ్డి వికృత క్రీడలకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ -2 వ పేజీలో..



## ..ఆధారాలివ్వకుంటే

# క్రిమినల్ కేసులు

### ఆర్ఎస్పీకి సజ్జనార్ నోటీసులు

హైదరాబాద్, జనవరి 23 (ఈవార్తలు): బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేసిన ఆరోపణలపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్, సిట్ చీఫ్ వీసీ సజ్జనార్ తీవ్రంగా స్పందించారు. తనపై ఏడు క్రిమినల్ కేసులు ఉన్నాయంటూ ప్రవీణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి రెండు రోజుల్లో ఆధారాలు సమర్పించాలని -2 వ పేజీలో...



# మునుగోడులో 'లిక్కర్' వార్!

### ఎక్సైజ్ వర్సెస్ రాజగోపాల్ రెడ్డి.. వైన్స్ తెరిచే సమయాలపై రచ్చ

మునుగోడు నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అనుచరులకు, ఎక్సైజ్ అధికారులకు మధ్య చోటుచేసుకున్న వివాదం ఇప్పుడు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. మద్యం దుకాణాల పనివేళల విషయంలో జోక్యం చేసుకున్న కాంగ్రెస్ నాయకులు, అధికారులతో వాగ్వాదానికి దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

మునుగోడు, జనవరి 23 (ఈవార్తలు): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారంటూ ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మధ్యాహ్నం 1 గంట తర్వాతే వైన్ షాపులు తెరవాలని కాంగ్రెస్ నాయకులు హుకుం జారీ చేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే పలుచోట్ల మద్యం - 2 వ పేజీలో...



# మేడారంకు కేంద్రం 3.7 కోట్లు

## నిధులు మంజూరు చేసిన మోదీ సర్కారు

మేడారం మహా జాతర కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ, గిరిజన వ్యవహారాల శాఖలు సంయుక్తంగా రూ. 3.70 కోట్లు నిధులు విడుదల చేశాయి. కాగా, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి.. ఈ నిధులు మంజూరు అయ్యేలా చొరవ తీసుకున్నారు.

న్యూఢిల్లీ: మేడారం మహా జాతరకు భారీ సంఖ్యలో భక్తులు వస్తున్నందున.. మెరుగైన సదుపాయాలు కల్పించడానికి నిధులను విడుదల చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇదే కాకుండా గతంలో కూడా కేంద్ర పర్యాటక శాఖ నిధులు మంజూరు చేసింది. మేడారంతో పాటు దాని చుట్టుపక్కల ఉన్న ములుగు, లక్నవరం, తాడ్వాయి, దామరవాయి, మల్లూరు, బొగత



# ఐరాసకు అమెరికా గుడ్‌బై

## 2వేల కోట్లు బాకీపడ్డ అగ్రరాజ్యం

వాషింగ్టన్: అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్‌వో నుంచి అధికారికంగా వైదొలిగింది. కొవిడ్ మహమ్మారిని అదుపు చేయడంలో, సంస్కరణలను అమలుచేయడంలో డబ్ల్యూహెచ్‌వో విఫలమైందని అమెరికా ఆరోగ్య, మానవ సేవల విభాగం తెలిపింది. ఇకపై డబ్ల్యూహెచ్‌వోకు అమెరికా నుంచి వచ్చే అన్నిరకాల నిధులు నిలిపివేస్తున్నామని.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దాని అన్ని కార్యాలయాల నుంచి

## రాశి ఫలాలు
24.1.2026

మేషం: ఆర్థిక అభివృద్ధి కలుగుతుంది. దూర ప్రాంత ప్రయాణాలు అనుకూలిస్తాయి. వృత్తి, ఉద్యోగముల విషయంలో సంతృప్తికర వాతావరణం ఉంటుంది. వాహన సంభందిత వ్యాపారాలు లాభాలుబాట పడతాయి. స్థిరాస్తి క్రయవిక్రయాలలో ఆశించిన లాభాలు పొందుతారు. ఇతరులతో సఖ్యతగా వ్యవహరిస్తారు.

వృషభం: ఆరోగ్య విషయంలో శ్రద్ద వహించాలి. ముఖ్యమైన పనులందు ఆటంకములు కలిగిన సమయస్ఫూర్తితో పనులు పూర్తి చేస్తారు. బంధు మిత్రులతో అకారణ వివాదములకు దూరంగా ఉండటం మంచిది. భాగసౌమ్య వ్యాపారాలలో నష్ట సూచనలు ఉన్నవి. ప్రయాణాలలో వాహన ఇబ్బందులు కలుగుతాయి.

మిథునం: వ్యాపారాలు విస్తరణకు నూతన అవకాశాలు లభిస్తాయి. ఆదాయ వ్యవహారములు మరింత పుంజుకుంటాయి. ముఖ్యమైన పనులలో జీవిత భాగస్వామి సహాయ సహకారాలు అందుతాయి. మొండి బకాయిలు వసూలవుతాయి. బంధు మిత్రుల ఆదరణ పొందుతారు. ప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

కర్కాటకం: వృత్తి వ్యాపారాలలో పై చేయి సాధిస్తారు. నూతన పరిచయాలు భవిష్యత్తుకు ఉపయోగపడతాయి. సంతానం పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి. ఉద్యోగ విషయంలో శుభవార్తలు అందుతాయి.

సింహం: వృత్తి వ్యాపారాలు అభివృద్ధి బాటలో సాగుతాయి. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. గృహ వాహన సంబంధిత క్రయ విక్రయాలలో అనుకూల ఫలితాలు పొందుతారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ధన వ్యవహారాలు సజావుగా సాగుతాయి.

కన్య: దీర్ఘకాలిక ఋణాల నుండి కొంత ఊరట లభిస్తుంది. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. సన్నిహితులతో వివాదాలు పరిష్కారమవుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన బాధ్యతలు పెరిగిన సమర్ధవంతంగా నిర్వహిస్తారు. వ్యాపారాలు ఉత్సాహముగా సాగుతాయి. స్వల్ప ధన లాభ సూచనలున్నవి.

తుల: సోదరులతో ఆస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు వాయిదా వేస్తారు. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలి. వృత్తి వ్యాపారాలలో చికాకులు తప్పవు. ఉద్యోగ వ్యవహారములు చిన్నపాటి సమస్యలు ఉంటాయి. వ్యాపార మందకొడిగా సాగుతాయి.

వృశ్చికం: చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. విలువైన వస్తువులు విషయంలో జాగ్రత్త వహించాలి. సన్నిహితులతో వివాదాలు సర్దుమణుగుతాయి. దూరపు బంధువుల నుండి కొంత కీలక సమాచారం సేకరిస్తారు. ఉద్యోగమున విధులు సమర్ధవంతంగా నిర్వహించి అధికారుల నుండి ప్రశంసలు పొందుతారు.

ధనస్సు: దూర ప్రాంత బంధువులు నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనులలో శ్రమ పెరిగిన నిదానంగా పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారములు లాభసాటిగా సాగుతాయి. గృహమున బంధు మిత్రులతో ఆనందంగా గడుపుతారు. ఉద్యోగమున పురోగతి కలుగుతుంది. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

మకరం: ధార్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆదాయ వ్యవహారాలు అంతంత మాత్రంగా ఉంటాయి. చెయ్యని పనికి ఇతరుల నుండి విమర్శలు ఎదురవుతాయి. చేపట్టిన పనులలో కష్టానికి తగిన ఫలితం ఉండదు. నూతన వ్యాపార ప్రారంభమునకు ఆటంకాలుంటాయి. ఉద్యోగ విషయంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది.

కుంభం: కుటుంబ సభ్యుల నుండి ఊహించని బహుమతులు అందుకుంటారు. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. గృహమున వివాహ శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. సన్నిహితులతో వివాదాలు పరిష్కరించుకుంటారు. ముఖ్యమైన వ్యవహారములు అనుకూలంగా సాగుతాయి. సంతానం విద్యా ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

మీనం: ఆదాయం ఆశించిన విధంగా ఉంటుంది. కుటుంబ సభ్యులతో దైవ దర్శనాలు చేసుకుంటారు. సంతాన విషయమై కీలకమైన నిర్ణయాలు తీసుకుంటారు. వృత్తి వ్యాపారాలు మిశ్రమంగా రాణిస్తాయి. ఉద్యోగమున అధికారుల ఆదరణ పెరుగుతుంది. ఆర్థిక లాభాలు అందుతాయి. మిత్రుల నుండి శుభ వార్తలు అందుతాయి.



# ట్యాపింగ్ తప్పేం కాదు!

మొదటి పేజీ తరువాయి

పరిశీలిస్తుంది. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా ట్యాపింగ్ జరిగినట్లు తేలితే, ఆ రికార్డులను వెంటనే నాశనం చేయాలని ఆదేశిస్తుంది. కేంద్ర ప్రభుత్వం తరపున ఇంటెలిజెన్స్ బ్యూరో, సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఎన్ఐఏ, రా వంటి 10 ఏజెన్సీలకు మాత్రమే ట్యాపింగ్ చేసే అధికారం ఉంది. ప్రభుత్వాలు జాతీయ భద్రత కోసం చట్టబద్ధంగా నిఘా పెడతాయి. అయితే, రాజకీయ ప్రత్యర్థులపై అనధికారికంగా ట్యాపింగ్ చేస్తున్నారనే ఆరోపణలు తరచుగా రావడమే ప్రస్తుతం సమస్యగా మారింది.

### అనధికార ట్యాపింగ్‌కు శిక్ష ఇలా..

భారత్‌లో అనధికారికంగా ఫోన్ ట్యాపింగ్ చేయడం తీవ్రమైన నేరం. ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్ (సెక్షన్ 25, 26), కొత్త టెలికమ్యూనికేషన్స్ చట్టం 2023 ప్రకారం, అనధికారికంగా కాల్స్ రికార్డ్ చేయడం లేదా అడ్డగించడం వంటి నేరాలకు 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అక్రమంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడితే రూ.2 కోట్ల వరకు జరిమానా విధించవచ్చు. కొన్ని సందర్భాల్లో జైలు శిక్ష, జరిమానా రెండూ కలిపి విధించే అవకాశం ఉంది. ప్రైవేట్ వ్యక్తులు లేదా అధికారులు అనుమతి లేకుండా ట్యాపింగ్ చేస్తే, దానిని గోప్యత హక్కు ఉల్లంఘనగా పరిగణిస్తారు. దీనిపై బాధితులు హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు లేదా కోర్టులో కేసు వేయవచ్చు. చట్టవిరుద్ధంగా సేకరించిన ఫోన్ కాల్ రికార్డింగ్‌లు కోర్టులో సాక్ష్యాలుగా చెల్లుబాటు కావు. ప్రభుత్వ అధికారులు నిబంధనలు అతిక్రమించి ట్యాపింగ్ చేస్తే, వారిపై క్రిమినల్ కేసులతో పాటు సర్వీసు పరమైన కఠిన చర్యలు తీసుకుంటారు. మీ ఫోన్ అనధికారికంగా ట్యాప్ అవుతోందని భావిస్తే, వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయవచ్చు లేదా మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించవచ్చు.

### ఏయే దేశాల్లో ఎలా..

అమెరికా: ఇక్కడ సాధారణంగా వన్-పార్టీ కన్సెంట్ (ఒక వ్యక్తి అనుమతి) ఉన్న దేశాల్లో కాల్ రికార్డింగ్‌కు అనుమతి ఉంది. కానీ ప్రభుత్వ నిఘాకు కచ్చితమైన కోర్టు వారెంట్లు అవసరం.

యూకే, జర్మనీ: ఇక్కడ గోప్యతా చట్టాలు చాలా కఠినంగా ఉంటాయి. జర్మనీ వంటి దేశాల్లో ఆల్-పార్టీ కన్సెంట్ (అందరి అనుమతి) లేకుండా రికార్డ్ చేయడం చట్టవిరుద్ధం.

చైనా: ప్రభుత్వ నిఘా చాలా విస్తృతంగా ఉంటుంది. ఇక్కడ పౌరుల ప్రైవసీ కంటే ప్రభుత్వ నియంత్రణకే ప్రాధాన్యం ఉంటుంది.



# లీకుల వంట

మొదటి పేజీ తరువాయి

మాజీ మంత్రి కేటీఆర్ ప్రస్తావించారు. లీకులను ఎవరూ నమ్మొద్దు.. ఇది లీకు వీరుల ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. లీకులపై ఆధారపడి ప్రభుత్వం నడిపిస్తున్నారని సెటైర్లు గుప్పించారు. కొంతమంది హీరోయిన్ల ఫోన్లు ట్యాప్ చేసి.. బెదిరించామని బయట ప్రచారం జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇది వాస్తవమా కాదా అని సిట్‌ను తాను అడిగానని తెలిపారు. ఆ వార్తలు అవాస్తవమని అధికారులు చెప్పారని స్పష్టం చేశారు. అవాస్తవాలు ప్రచారం చేసే వారిపై చర్యలేవి? అని తాను ప్రశ్నించానని అన్నారు. ఇప్పుడు తమ ఫోన్లు ట్యాప్ కావటం లేదా? అని అధికారులను నిలదీశానని తెలిపారు. తన ప్రశ్నలకు సిట్ అధికారులు నీళ్లు నమిలారని విమర్శించారు. అడిగిన ప్రశ్నలే మళ్లీ మళ్లీ అడిగి వేధించారని ధ్వజమెత్తారు. విచారణ పేరుతో వేధించడం తప్ప.. వీళ్లు చేసేదేమీ లేదని ఎద్దేవా చేశారు. సింగరేణి టెండర్లలో దొంగలు దొరికారని ఆరోపణలు చేశారు. పారిశ్రామికవేత్తకు గన్ పెడితే సిట్ ఎందుకు వేయరు? సీఎం రేవంత్‌రెడ్డి తన మంత్రుల, సన్నిహితుల దోపిడీపై సిట్ వేయరా? అని నిలదీశారు. న్యాయం, ధర్మం అందరికీ ఒకేలా ఉండాలని చెప్పుకొచ్చారు. సెలక్టివ్‌గా లీకులు ఇచ్చి తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. తనను ఎవరితోనూ కలిపి అధికారులు విచారించలేదని చెప్పుకొచ్చారు. ఈ విచారణలో తాను తప్ప మరే 'రావు' లేరని తెలిపారు. తనను విచారణకు మళ్లీ పిలుస్తామని అధికారులు అన్నారని, బాధ్యత గల ప్రతిపక్షంగా ఏ విచారణకైనా సహకరిస్తామని స్పష్టం చేశారు.

# సజ్జనార్‌పై 7 కేసులు

మొదటి పేజీ తరువాయి

పార్టీ నాయకులు గెస్ట్‌హౌస్‌లలో దోపిడీ చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులను వేధించేందుకు అక్రమ సిట్‌ను ఏర్పాటు చేశారన్నారు. సజ్జనార్ సిట్ అధికారిగా ఉన్నారని.. ఆయనపై ఏడు కేసులు ఉన్నాయని.. ఆయన సిట్ చీఫ్‌గా ఉండడం ఏందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసును విచారించే నైతిక హక్కు సజ్జనార్, శివధర్‌రెడ్డికి లేదని మండిపడ్డారు.

# ..ఆధారాలివ్వకుంటే క్రిమినల్ కేసులు

మొదటి పేజీ తరువాయి



కోరుతూ శుక్రవారం ఆయనకు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం ఉదయం ప్రవీణ్ కుమార్ ఓ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. సజ్జనార్‌పై ఏడు క్రిమినల్ కేసులు ఉన్నాయని, ఆయన నేతృత్వంలోని సిట్ విచారణ సరికాదని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావుకు నోటీసులు ఇవ్వడాన్ని ఆయన తప్పుబట్టారు. సజ్జనార్‌పై ఉన్న కేసుల విచారణకు మరో సిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలను సజ్జనార్ తీవ్రంగా ఖండించారు. ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యలు పరువుకు నష్టం కలిగించేలా, బాధ్యతారహితంగా, తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని నోటీసులో పేర్కొన్నారు. 'ఈ తప్పుడు ఆరోపణల ద్వారా సిట్, దాని చీఫ్ ప్రతిష్ఠను దెబ్బతీయడమే కాకుండా, చట్టబద్ధమైన విధులకు ఆటంకం కలిగించే ప్రయత్నం చేశారు. దర్యాప్తు విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు' అని సజ్జనార్ తెలిపారు. తనపై ఉన్నాయని ఆరోపిస్తున్న ఏడు క్రిమినల్ కేసులకు సంబంధించిన పూర్తి వివరాలను నోటీసు అందిన రెండు రోజుల్లోగా సమర్పించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా స్పందించకపోతే, పరువు నష్టం దావాతో పాటు సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మేడారంకు కేంద్రం 3.7 కోట్లు

మొదటి పేజీ తరువాయి

జలపాతం వంటి ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించానికి రూ. 80 కోట్లు ఇచ్చింది. గిరిజన సర్క్యూట్ పేరిట పర్యాటకులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడానికి, పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి ఈ నిధులు విడుదల చేసింది. అంతకుముందు యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ అభివృద్ధి కోసం రూ. 140 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. మరోవైపు, జనవరి 28 నుంచి ప్రారంభం కానున్న మేడారం మహా జాతరకు వచ్చే ప్రజల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే, తెలంగాణ ఆర్టీసీ సమన్వయంతో ప్రత్యేక రవాణా ఏర్పాట్లు చేశాయి. దక్షిణ మధ్య రైల్వే 28 స్పెషల్ ట్రైన్లు నడపనున్నట్లు ప్రకటించింది. అయితే మేడారం గ్రామానికి నేరుగా రైలు మార్గం లేదు. కానీ సమీపంలోని వరంగల్, కాజీపేట స్టేషన్లకు చేరుకోవడానికి ఈ రైళ్లు ఎంతో ఉపయోగపడనున్నాయి. జనవరి 28, 29 తేదీల్లో ఈ ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయని రైల్వే శాఖ వెల్లడించింది. ఈ ప్రత్యేక రైళ్లు ప్రధానంగా సికింద్రాబాద్ నుంచి మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్ మార్గాల్లో రైళ్లు నడవనున్నాయి. అంతేకాకుండా నిజామాబాద్ నుంచి వరంగల్‌కు, కాజీపేట నుంచి ఖమ్మం, ఆదిలాబాద్ ప్రాంతాలకు స్పెషల్ రైళ్లు నడుస్తాయి.

## ఐరాసకు అమెరికా గుడ్‌బై

మొదటి పేజీ తరువాయి

యూఎస్ సిబ్బందిని వెనక్కి పిలిపించినట్లు వెల్లడించింది. ఈ సంస్థకు సంబంధించిన సాంకేతిక కమిటీలు, వర్కింగ్ గ్రూపుల నుంచి కూడా వైదొలుగుతున్నట్లు తెలిపింది. ఇకనుంచి పరిమిత పరిధి మేరకు డబ్ల్యూహెచ్‌వోతో కలిసి పనిచేయనున్నట్లు యూఎస్ ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. రెండోసారి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలు సందర్భాల్లో ఆ సంస్థ నుంచి వైదొలుగుతామని హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా అగ్రరాజ్యం తన నిర్ణయాన్ని ప్రకటించడం గమనార్హం. అయితే డబ్ల్యూహెచ్‌వో నుంచి అగ్రరాజ్యం వైదొలిగే సమయానికి అమెరికా దానికి రూ.2,382 కోట్లు బకాయిలను చెల్లించాల్సి ఉంది. ఈ విషయంపై డబ్ల్యూహెచ్‌వో అధికారులు మాట్లాడుతూ.. సంస్థ నుంచి వైదొలుగుతున్నట్లు అమెరికా వెల్లడించగానే సరిపోదని, సంస్థకు బకాయిపడిన 260 మిలియన్ డాలర్లను చెల్లించేవరకు డబ్ల్యూహెచ్‌వో నుంచి యూఎస్ ఉపసంహరణ పూర్తి కాదన్నారు. అయితే ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెల్లించాల్సిన బకాయిలపై అమెరికా అధికారిక వర్గాలు స్పందిస్తూ.. సంస్థ నుంచి వైదొలగడానికి ముందు బకాయిలను పూర్తిగా చెల్లించాలనే చట్టబద్ధమైన నియమం లేదని పేర్కొంటుండటం గమనార్హం.

## మునుగోడులో 'లిక్కర్' వార్!

మొదటి పేజీ తరువాయి

వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేస్తూ, షాపులను బలవంతంగా మూసివేయించారనే వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో సంస్థాన్ నారాయణపురం మండలంలో అధికారులు రంగంలోకి దిగారు. రాజగోపాల్ రెడ్డి అనుచరులు బలవంతంగా మూసివేయించిన వైన్ షాపుల వద్దకు చేరుకున్న ఎక్సైజ్ సిబ్బంది, శుక్రవారం ఉదయం వాటిని తిరిగి తెరిపించారు. చట్ట ప్రకారం నిర్ణీత సమయానికే షాపులు నడపాలని, ఎవరైనా అడ్డుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. దీంతో అధికారుల పర్యవేక్షణలో మద్యం అమ్మకాలు యథావిధిగా ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం మునుగోడులో అధికార యంత్రాంగానికి, రాజకీయ నాయకులకు మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. నిబంధనల ప్రకారం షాపులు నడవాలని అధికారులు చెబుతుంటే, తమ నాయకుడి మాట చెల్లుబాటు కావాలని కార్యకర్తలు పట్టుబడుతున్నారు. ఉదయం నుంచే మద్యం విక్రయాలు జరుగుతున్నప్పటికీ, ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న టెన్షన్ స్థానికుల్లో నెలకొంది.

# కేటీఆర్ ట్యాపింగ్ దొంగ

మొదటి పేజీ తరువాయి

అసమర్థ ప్రభుత్వం అని మండిపడ్డారు. ఢిల్లీకి ముడుపులు కోసమే ఫోన్ ట్యాపింగ్ విచారణ పేరుతో సాగదీస్తున్నారని ధ్వజమెత్తారు. విచారణ పేరుతో హడావుడి చేసినప్పుడల్లా ఫాంహౌజ్ నుండి ఏఐసీసీకి ముడుపులు వెళుతున్నాయంటూ సంచలన ఆరోపణలు చేశారు. కరీంనగర్‌లో కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందనడానికి అన్ని ఆధారాలు, సాక్షాలు పోలీసుల వద్ద ఉన్నాయని, తనను విచారణకు పిలిచిన సమయంలో ఆ ఆధారాలను, సాక్షాలను సైతం చూపించారని గుర్తు చేశారు. జడ్జీల ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు తేలిందన్నారు. అయినా కేసీఆర్ కుటుంబాన్ని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. 'ఫోన్ ట్యాపింగ్ పై సిట్ విచారణ టీవీ సీరియల్‌ను మించి ఆది అంతం లేకుండా కొనసాగుతూనే ఉంది. కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేకపోతున్నారు. సిట్ అధికారులకు స్వేచ్ఛ ఇవ్వడం లేదు.'అని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ అని ఆరోపించారు. 'ప్రభుత్వంలో కొందరు పెద్దలు ఆదేశాలకు అనుగుణంగానే విచారణ చేస్తున్నారు. నిజానికి సిట్ అధికారులు సమర్థులు, నిజాయితీపరులు. కానీ వాళ్లపై ప్రభుత్వం జులుం ప్రదర్శిస్తోంది. ఆ పెద్దలు ఎవరిని పిలవమని అడిగితే వాళ్లనే పిలిచి విచారణ చేస్తున్నారు. నేనడుగుతున్నా.. కేటీఆర్‌ను ఎందుకు విచారణకు పిలిచారు ఆయన ఫోన్ ట్యాపింగ్ చేయించినందుకు పిలిచారా లేక ఆయన ఫోన్ కూడా ట్యాప్ అయ్యిందని చెప్పడానికి పిలిచారా'అని నిలదీశారు. 'సిరిసిల్ల కేంద్రంగా వార్ రూంను ఏర్పాటు చేసి ఫోన్ ట్యాపింగ్ చేశారని నేను చాలా సార్లు చెప్పిన. యువరాజు కేటీఆర్ ఆడిందే ఆటగా ఫోన్ ట్యాపింగ్ చేయించి పాలనను కొనసాగించారు. బ్రిటీష్ పాలన తరహాలో



పాలన చేశారు' అని వ్యాఖ్యలు చేశారు. 'ఫోన్ ట్యాపింగ్ ద్వారా రూ.వేల కోట్ల లావాదేవీలు జరిగాయి. రియల్ ఎస్టేట్ బిల్డర్లు, వ్యాపారులను, సినీ నటులను బెదిరించి కోట్లు దండుకున్నారు. బెదిరించి బీఆర్ఎస్ పార్టీకి ఎలక్ట్రోరల్ బాండ్స్ కొనుగోలు చేయించారు. నా ఫోన్లను, ప్రస్తుత సీఎం, మంత్రుల ఫోన్లతోపాటు జడ్జీల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు. కేసీఆర్ కుటుంబమే ఇదంతా చేసింది. అసలు కారకులైన వాళ్లను సాక్షిగా పిలిచి విచారణ పేరుతో వాంగ్మూలం నమోదు చేయడమేంటి'అని నిలదీశారు. 'కేసీఆర్ కుటుంబ అవినీతి, అరాచకాలపై చర్యలు తీసుకునే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు. ఇయాళ కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్ దొంగ. సిరిసిల్ల కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ చేయించింది కేటీఆరే. ఆ దొంగే నీతులు చెబితే నమ్మే పరిస్థితుల్లో నేను లేను.' కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పుకొచ్చారు.'మంది కొంపలు ముంచి వ్యక్తిత్వ హననం గురించి మాట్లాడతారా కేటీఆర్ చేసిన అరాచకాలు ఇంకా మా కళ్ల ముందు కన్పిస్తున్నాయి. ఈ సర్కార్ కు చేతగాదు. బీజేపీని ఆశీర్వదించి అధికారం అప్పగిస్తే కేసీఆర్ కుటుంబానికి చుక్కలు చూపేవాళ్లం. దారుణాలు, అక్రుత్యాలు చేసే వాళ్లకు సొసైటీలో ఏ విధమైన గుణపాఠం చెప్పేవాళ్లమో చూపేవాళ్లం' అని పేర్కొన్నారు.

# సిట్.. స్క్రిప్టెడ్ ఇన్వెస్టిగేషన్ టీమ్

మాజీమంత్రి హరీశ్ రావు ఎద్దేవా



హైదరాబాద్, జనవరి 23 (ఈవార్తలు): సింగరేణిలో సోలార్ పవర్ స్కాం జరిగిందని.. 107 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌లో పెద్ద కుంభకోణం జరిగిందని మాజీమంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. మూడు వేరువేరు సైట్లలో సోలార్ పవర్ ప్లాంట్లను పెట్టేందుకు తమ అనుయాయులకు కట్టబెట్టడానికి, ఎంఎస్ఎంఈలు పాల్గొనకుండా మూడు సైట్లు కలిపి 107 మెగావాట్లతో సింగిల్ టెండర్ పిలిచారని అన్నారు. ఎంఎస్ఎంఎల్ఈలు, పారిశ్రామికవేత్తలు పాల్గొనకుండా సోలార్ పవర్ ప్లాంట్‌ను ఎత్తుకపోవడానికి సైట్ విజిట్ సర్టిఫికెట్ కండీషన్‌ను పెట్టారని పేర్కొన్నారు. వారు అనుకున్న వారికి రూ.250 కోట్ల అదనంగా వచ్చేలా ఈ టెండర్లను కట్టబెట్టారని.. ఈ టెండర్‌ను గిల్టీ పవర్ లిమిటెడ్ అనే కంపెనీకి ఇచ్చారని ఆరోపించారు. దేశవ్యాప్తంగానూ సోలార్ పవర్‌పై టెండర్లు కొనసాగుతున్నాయని.. ఒక మెగావాట్ సోలార్ ఉత్పత్తి చేయడానికి మూడున్నర కోట్లు అవుతుందని.. పైగా భూమి కూడా సోలార్ కంపెనీలదే ఉంటుందని తెలిపారు. కానీ.. ఇక్కడ సింగరేణి భూమిలో సోలార్ ప్లాంట్లు పెట్టి సోలార్ పవర్ ఉత్పత్తి చేసినందుకు ఒక మెగావాటుకు రూ.5కోట్ల 4 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి ఆ కాంట్రాక్టర్కు చెల్లించబోతున్నదని ఆరోపించారు. రూ.540 కోట్ల ఈ టెండర్‌ను వారికి కావాల్సినవారికి కట్టబెట్టారని పేర్కొన్నారు. సింగరేణి దాదాపు రూ.200 కోట్లు అదనంగా చెల్లించాల్సి వచ్చిందన్నారు. ఈ సోలార్ పవర్ స్కామ్ రామగుండంలో జరిగిందనని అన్నారు. 67 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌లోనూ అవినీతి జరిగిందని అన్నారు. దాదాపు ఏడు కోట్లకు ఒక మెగావాటు సోలార్ పవర్ ఉత్పత్తికి ఈ ప్లాంట్‌ను కట్టబెట్టారని.. నేషనల్ ఆవరేజ్ కంటే ఇది డబుల్ కాస్ట్ అని చెప్పారు. రూ.480 కోట్లకు వారికి కావలసిన కంపెనీకి కట్టబెట్టారని తెలిపారు. అక్కడ రూ.250 కోట్లు.. ఇక్కడ రూ.250 కోట్లు నేరుగా చేతులు మారాయని ఆరోపించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కొత్తగూడెంలో సింగరేణి హెడ్ ఆఫీస్‌కి వెళ్లి శనివారం రివ్యూ చేస్తున్నారని తమకు సమాచారం ఉన్నదని.. బీఆర్ఎస్ బయట పెడితేనే ఢిల్లీలో ఎమర్జెన్సీ మీటింగ్ అయిందని.. ఢిల్లీ కిషన్‌రెడ్డి గల్లీకి వచ్చి కొత్తగూడెంలో సింగరేణిపై మీటింగ్ పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ కుంభకోణంపై విచారణ జరపాలని ఈ మేరకు కిషన్‌రెడ్డికి లేఖ రాస్తున్నట్లు తెలిపారు. సింగరేణిలో ఎక్స్‌ప్లోజింగ్ స్కాం సైతం జరిగిందని.. జిలెటిన్ స్టిక్స్ కొనుగోలులో 30శాతం రేటు అదనంగా పెట్టి కొనాలని ఒత్తిడి తెచ్చారని హరీశ్‌రావు ఆరోపించారు. జీవీ రెడ్డి అనే ఒక డైరెక్టర్ 30శాతం ఎక్కువ రేటుకు కొనడానికి నిరాకరించారని.. ఒత్తిడి చేస్తే చివరికు రాజీనామా చేసి వెళ్లిపోయారని అన్నారు. తర్వాత ఇంకో డైరెక్టర్ వీకే శ్రీనివాస్ కూడా సంతకం పెట్టనని నిరాకరిస్తే ఆయనను డైరెక్టర్ నుంచి జీఎం పదవికి రివర్స్ చేశారన్నారు. ఇలా బెదిరించి భయపెట్టి నిబంధనలు మార్చి కోట్లాది రూపాయల స్కాంకు తెరదీస్తున్నారని పేర్కొన్నారు. ప్రకాశం ఖని స్కాంలోనూ సైట్ విజిట్ సర్టిఫికెట్ పెట్టి టెండర్‌ను పిలిచారన్నారు. ఫిబ్రవరి 2న లాస్ట్ డేట్ ఉన్నదని.. ఇక్కడ కూడా రింగు చేస్తున్నారని ఆరోపించారు. రూ. 1,044 కోట్లతో సైట్ విజిట్ సర్టిఫికెట్ పెట్టి ఈ టెండర్‌ను పిలిచారని.. ప్రకాశం గని టెండర్‌ను సైతం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే.. శ్రీరాంపూర్‌లో ఓబీ టెండర్లలోనూ స్కాం జరిగినట్లు చెప్పారు. రూ.600 కోట్ల వర్క్ టెండర్ పిలిచారని.. టెక్నికల్ బిడ్ ఓపెన్ చేసి ఫైనాన్షియల్ బిడ్డు కోసం ఏడుసార్లు డేట్ ఇచ్చి వాయిదా వేశారని తెలిపారు. రేవంత్‌రెడ్డి బామ్మర్ది సృజన్ రెడ్డి చెబితే ఫైనాన్షియల్ బిడ్ వాయిదా వేయడం జరిగిందన్నారు. హైదరాబాద్ హోటల్‌లో సృజన్‌రెడ్డి సెటిల్మెంట్లు కుదరకపోవడం వల్ల వాయిదా వేశారని ఆరోపించారు. దీనిపైనా కిషన్‌రెడ్డి విచారణ చేపట్టాలన్నారు. ఆరు ఓబీ కాంట్రాక్టర్లను వెంటనే రద్దు చేయాలన్నారు. జైపూర్‌లో సింగరేణి నిర్మిస్తున్న థర్మల్ పవర్ ప్లాంట్‌లోనూ అవకతవకలు జరిగాయని.. త్వరలో సమాచారం బయట పెడతానని చెప్పారు. రేవంత్‌రెడ్డికి నిజాయితీ ఉంటే వెంటనే సృజన్‌రెడ్డిపై సిట్ వేయాలని.. సింగరేణి కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ మధ్య ఫెవికాల్ బంధం లేకపోతే కిషన్‌రెడ్డి ఇప్పటివరకు పిలిచిన అన్ని టెండర్లు రద్దు చేయాలని, పూర్తి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సీఎం బావమరిది సృజన్‌రెడ్డి అవినీతి బాగోతాలను కప్పిపుచ్చుకునేందుకే రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో సిట్ అంటే స్క్రిప్టెడ్ ఇన్వెస్టిగేషన్ టీంగా మారిందని ఆరోపించారు. వరుసగా మీడియాకు లీకులు ఇస్తున్నారన్నారని.. ఆ లీకులకు ఆధారాలు ఏమిటని ప్రశ్నించారు. వాస్తవ పరిస్థితులు వేరు.. ఇస్తున్న లీకులు వేరని తెలిపారు. తాను విచారణకు వెళ్ళినప్పుడు తనపై ఇలాంటి దుష్ప్రచారం చేశారని చెప్పారు. ఒకరకంగా ఇది రాజ్యాంగం మీద దాడి అని.. వ్యక్తిత్వ హననం అవుతుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర రాజకీయాలు, డ్రామాలు చేస్తున్నదని అన్నారు. రేవంత్‌రెడ్డి పిరికితనానికి నిదర్శనమని.. చాతకాని వాళ్ళు చేసే పని అని అన్నారు. రేవంత్‌కు ధైర్యం ఉంటే వీడియో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సిరుల గని సింగరేణి అని.. కానీ.. సింగరేణి సృజన్ గనిగా మారిపోయిందని ఆరోపించారు. ఈ స్కాం నుంచి బయటపడేందుకు కాంగ్రెస్ బీజేపీతో కుమ్మక్కై సిట్ల డ్రామా నడిపిస్తున్నదని అన్నారు. 'రిటైర్మెంట్ అయినా వదిలిపెట్టం.. ఏ పొక్కలో దాక్కున్నా, సప్త సముద్రాల అవతల ఉన్నా పట్టుకొచ్చి విచారిస్తం. చట్టాన్ని అతిక్రమించి పనిచేసే అధికారులు, పోలీసులు జాగ్రత్త' అని హరీశ్‌రావు హెచ్చరించారు. రేపు అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని.. వారికి ఏమాత్రం సహకరించమని అన్నారు. సొంత డబ్బులతో, సొంత లాయర్లను పెట్టుకొని కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న అధికారులను సిట్‌లో పెట్టి తమ మీద ప్రయత్నాలు చేస్తున్నారని.. అధికారులు అన్యాయంగా, అక్రమంగా వ్యవహరిస్తే, ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టాలని ప్రయత్నం చేస్తే ఎవర్నీ వదిలి పెట్టే ప్రశ్నే లేదన్నారు. చట్టాన్ని అతిక్రమించినా, న్యాయబద్ధంగా వ్యవహరించకపోయినా, తప్పుడు లీకులు ఇచ్చినా విడిచేది లేదన్నారు. దావోస్ నుంచి రేవంత్‌రెడ్డి ఇచ్చే డైరెక్షన్‌లో కాకుండా చట్ట ప్రకారం వ్యవహరించాలని అన్నారు.




## 2 లక్షలు లంచంతో పట్టుబడ్డ సీనియర్ అసిస్టెంట్

ఆదిలాబాద్, జనవరి 23 (ఈవార్తలు): ఆదిలాబాద్ జిల్లాలో ఓ రెవెన్యూ ఉద్యోగి లంచం తీసుకుంటూ తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. బజార్‌హత్నూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కటకం విద్యాసాగర్ రెడ్డి, ఓ రైతు నుంచి రూ. 2 లక్షలు లంచం తీసుకుంటుండగా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే, ఓ ఫిర్యాదుదారునికి చెందిన 8.35 ఎకరాల భూమికి సంబంధించిన సాదా బైనామా రిజిస్ట్రేషన్ దస్తావేజును ప్రాసెస్ చేసి పంపించడానికి విద్యాసాగర్ రెడ్డి ఈ మొత్తాన్ని డిమాండ్ చేశాడు. బాధితుడు ఈ విషయాన్ని ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. వారి సూచన మేరకు, పక్కా ప్రణాళికతో బాధితుడు డబ్బు ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి విద్యాసాగర్ రెడ్డిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచన చేశారు. ఏ ప్రభుత్వ అధికారి అయినా, ఉద్యోగి అయినా లంచం అడిగితే వెంటనే తమ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్, ఎక్స్ వంటి సోషల్ మీడియా ఖాతాల ద్వారా కూడా తమను సంప్రదించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను పూర్తి గోప్యంగా ఉంచుతామని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు.



## అవసరమైతే మళ్లీ పిలుస్తాం: సిట్

హైదరాబాద్, జనవరి 23 (ఈవార్తలు): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విచారణపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు స్పందించారు. 2024 మార్చిలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందంటూ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ప్రస్తుతం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ నేతృత్వంలో సిట్ దర్యాప్తు జరుపుతోంది. కేటీఆర్ విచారణ నేపథ్యంలో పలు ఊహాగానాలు మీడియాలో రావడంతో సిట్ ఓ ప్రకటన విడుదల చేసింది. సాక్షులను ప్రభావితం చేయవద్దని కేటీఆర్‌కు తెలియజేసినట్లు సిట్ తెలిపింది. అవసరమైతే మళ్లీ విచారణకు పిలుస్తామని కూడా ఆయనకు చెప్పినట్లు వెల్లడించింది. కేసీఆర్‌ను మరొకరితో కలిసి విచారణ జరిపారని మీడియాలో జరుగుతున్న ప్రచారంపై కూడా సిట్ స్పందించింది. కేటీఆర్‌ను ఒంటరిగానే ప్రశ్నించామని స్పష్టం చేసింది. ఆధారాలు, రికార్డులను ముందు ఉంచి ప్రశ్నించినట్లు పేర్కొంది. ఈ విచారణ నిష్పక్షపాతంగా జరిగిందని వెల్లడించింది. ఎలాంటి అసత్య ప్రచారాలను విశ్వసించవద్దని సూచించింది. అధికారిక ప్రకటనను మాత్రమే విశ్వసించాలని తెలిపింది.

## జనగామలో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

**అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలో తోపులాట**

జనగామ, జనవరి 23 (ఈవార్తలు): మంత్రి సీతక్క జనగామ పర్యటనలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. జనగామ జిల్లా కేంద్రంలో అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి సీతక్క, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అనుచరుల మధ్య మాటల యుద్ధం జరిగింది. పెంబర్తి క్రాస్ వద్ద చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ప్రోటోకాల్ ప్రకారం సీతక్క, పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని కాదని, ఈ ప్రాంత అభివృద్ధి కార్యక్రమాల్లో ఇతర నియోజకవర్గాలకు చెందిన వారికి ప్రాధాన్యత ఇచ్చారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. మరోవైపు, కొబ్బరికాయ కొట్టేందుకు బీఆర్ఎస్ నాయకులను ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డి ఆహ్వానించగా, ఇది బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమం కాదని కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం తెలిపారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నేతల మధ్య వాగ్వాదం, తోపులాటకు దారితీసింది. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు 'గో బ్యాక్' అంటూ నినాదాలు చేయగా, బీఆర్ఎస్ శ్రేణులు 'జై పల్లా' అంటూ ప్రతి నినాదాలు చేశారు.

## నార్మల్ మదర్ డెయిరీ చైర్మన్ రాజీనామా

నల్లగొండ, జనవరి 23 (ఈవార్తలు): నార్మల్ మదర్ డెయిరీ ఛైర్మన్ మందడి ప్రభాకర్ రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. నల్గొండ-రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నార్మల్ మదర్ డెయిరీ ఛైర్మన్‌గా ఆయన రెండు వారాల క్రితమే బాధ్యతలు స్వీకరించగా, ఇంతలోనే ఆయన పదవికి రాజీనామా చేయడం చర్చనీయాంశమైంది. నార్మల్ మదర్ డెయిరీకి ఛైర్మన్‌గా పనిచేసిన మధసూదన్ రెడ్డి రాజీనామా చేయడంతో ప్రభాకర్ రెడ్డి ఆ బాధ్యతలు చేపట్టారు. పాడి రైతుల పెండింగ్ బిల్లుల విషయంలో విభేదాల తలెత్తడంతోనే ప్రభాకర్ రెడ్డి ఛైర్మన్‌తో పాటు డైరెక్టర్ పదవులకు రాజీనామా చేసినట్లు సమాచారం. మందడి ప్రభాకర్ రెడ్డి ఈ నెల 8న ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 25 లోగా రూ.12 కోట్లు సంస్థకు అందేలా చూస్తానని ఆయన బాధ్యతలు స్వీకరించిన రోజు హామీ ఇచ్చారు. పాడి రైతుల పెండింగ్ బిల్లులు రూ.25 కోట్లకు పైగా ఉంటాయని అంచనా.

## ఫోన్ ట్యాపింగ్ నేరం కాదు: ఆర్ఎస్పీ

హైదరాబాద్, జనవరి 23 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలు కొత్త చర్చకు దారితీశాయి. ఈ కేసులో భాగంగా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సిట్ విచారణకు హాజరైన నేపథ్యంలో ప్రవీణ్ కుమార్ స్పందిస్తూ.. ఫోన్ ట్యాపింగ్ అనేది నేరం కాదని, అది దేశ రక్షణ కోసం చేపట్టే చట్టబద్ధమైన ప్రక్రియ అని పేర్కొనడం కలకలం రేపుతోంది. ఇవాళ మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ అంశంపై తన అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించారు. "దేశ రక్షణ, ప్రజల భద్రత దృష్ట్యా పోలీసులు రహస్యంగా ఫోన్లను ట్యాప్ చేస్తారు. ఇది స్వాతంత్ర్యం రాకముందు నుంచే అమల్లో ఉన్న చట్టబద్ధమైన ప్రక్రియ. దేశ భద్రత కోసం ట్యాపింగ్ చేయవచ్చని గతంలో ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్ కూడా చెప్పారు" అని ప్రవీణ్ కుమార్ గుర్తుచేశారు. గతంలో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి సైతం ట్యాపింగ్ తప్పు కాదని వ్యాఖ్యానించారని, మరి ఇప్పుడు ఆయనను ఎందుకు విచారించడం లేదని ఆయన సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ కేసును వాడుకుంటోందని ఆయన ఆరోపించారు.

**బీఆర్ఎస్ దీపం**

# ఆరిపోకుండా చూసుకోండి



హైదరాబాద్, జనవరి 23 (ఈవార్తలు): ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న విమర్శలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఘాటుగా స్పందించారు. శుక్రవారం మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన... వ్యక్తిగత హననం జరుగుతోందని కేటీఆర్ అనడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. రాజ్యాంగ పరిధిలోనే విచారణ సాగుతోందని స్పష్టం చేశారు. రాజకీయ కక్ష సాధింపు ధోరణి ఉంటే అధికారంలోకి రాగానే చర్యలు ఉండేవని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేటీఆర్ ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ఇద్దరి మధ్య సంభాషణ వినడం వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని అన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కుటుంబం అలీబాబా-420 దొంగల మాదిరిగా దోపిడీకి పాల్పడిందని మహేశ్ గౌడ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ స్టువర్ట్‌పురం దొంగల బ్యాచ్‌లా మారిందన్నారు. ఆరనీకుమా ఈ కార్తీకదీపం అనే ముందు, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ దీపం ఆరిపోకుండా చూసుకోవాలని సెటైర్లు వేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై కేటీఆర్ మాట్లాడటం పూర్తిగా హాస్యాస్పదమన్నారు. తోడబుట్టిన చెల్లెలు కవిత ఫోన్ ట్యాప్ చేశారని గగ్గోలు పెడుతుంటే ఇప్పటివరకు సరైన సమాధానం చెప్పలేదని గుర్తు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసు చాలా తీవ్రమైనదని, దీనిని ఉద్యమ కేసులతో పోల్చడం సరికాదని స్పష్టం చేశారు. అధికారులకు కూడా పరిమితులు ఉంటాయని అన్నారు. కాళేశ్వరం అవినీతిపై కేసీఆర్ కుటుంబంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బండి సంజయ్‌ను తాను నేరుగా ప్రశ్నిస్తున్నానని చెప్పారు. అలాగే బీజేపీ నేతలపై ఉన్న ఈడీ కేసులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ కీలక ప్రశ్న లేవనెత్తారు. దేశ భద్రతకు ముప్పుగా మారే శక్తులపై మాత్రమే ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందని, అలాంటప్పుడు సినిమా వాళ్ల ఫోన్లు ట్యాప్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. సినీ తారల ఫోన్లు ట్యాప్ చేయడం వెనుక ఉద్దేశం ఏంటని నిలదీశారు. నక్సలైట్లతో లావాదేవీలు జరుగుతున్నాయన్న అనుమానంతో తన ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని తెలిపారు. కల్వకుంట్ల కవితను తాను ఎప్పుడూ చెల్లెలుగానే గౌరవిస్తానని, ఆమె ఇప్పటికైనా నిజాలు మాట్లాడుతున్నందుకు స్వాగతిస్తున్నామని చెప్పారు. కేసీఆర్ కుటుంబంలో తగాదాలకు అసలు కారణం వాటాల పంపకంలో తేడాలేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పాలనలో కేవలం మూడు నెలల్లోనే 547 ఫోన్లు ట్యాప్ అయ్యాయని ఆరోపించారు. తన మిత్రుడి ఫోన్ కూడా ట్యాప్ అయ్యిందని తెలిపారు.



## మేడారంకు 28 ప్రత్యేక రైళ్లు

సికింద్రాబాద్, జనవరి 23 (ఈవార్తలు): ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర తేదీలు సమీపించాయి. ఈ నెల 28న ప్రారంభం కానున్న ఈ మహోత్సవానికి కోట్లాదిగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం తెలంగాణ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. ముఖ్యంగా దక్షిణ మధ్య రైల్వే, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సమన్వయంతో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ రవాణా సౌకర్యాలను కల్పిస్తున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే ఏకంగా 28 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. మేడారానికి నేరుగా రైలు మార్గం లేనందున, సమీపంలోని ప్రధాన రైల్వే స్టేషన్లయిన వరంగల్, కాజీపేటలకు ఈ రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. ఈ నెల 28, 29 తేదీల్లో ఈ ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయి. సికింద్రాబాద్ నుంచి మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్‌తో పాటు నిజామాబాద్ నుంచి వరంగల్‌కు, కాజీపేట నుంచి ఖమ్మం, ఆదిలాబాద్ ప్రాంతాలకు ఈ రైళ్లను నడుపుతున్నారు. దీనివల్ల హైదరాబాద్‌తో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి వచ్చే భక్తులకు ప్రయాణం సులభతరం కానుంది. రైళ్ల ద్వారా వరంగల్, కాజీపేట స్టేషన్లకు చేరుకున్న భక్తులు, అక్కడి నుంచి నేరుగా మేడారం గద్దెల వద్దకు వెళ్లేందుకు టీజీఎస్ఆర్టీసీ భారీ స్థాయిలో బస్సులను సిద్ధం చేసింది. రైల్వే స్టేషన్ల ప్రాంగణంలోనే ప్రత్యేక బస్ పాయింట్లను ఏర్పాటు చేసి, అక్కడి నుంచి నిరంతరాయంగా బస్సులను నడుపుతారు. రైలు దిగిన వెంటనే బస్సు అందుబాటులో ఉండేలా రైల్వే, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. జాతర ముగిసే జనవరి 31 వరకు ఈ రవాణా సౌకర్యాలు కొనసాగుతాయి.

## 27 ఎకరాల భూమి.. 1.2 కిలోల బంగారం

**రంగారెడ్డి జిల్లా జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌కు అక్రమాస్తులు**

**రూ.7,83,35,302 విలువైన స్థిర, చరాస్తులు గుర్తింపు**



రంగారెడ్డి, జనవరి 23 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లా జాయింట్ సబ్ రిజిస్ట్రార్ (ఎస్ఆర్ఓ-1)గా పనిచేస్తూ ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న కందాడి మధుసూదన్ రెడ్డిపై తెలంగాణ అవినీతి నిరోధక శాఖ అధికారులు అక్రమాస్తుల కేసు నమోదు చేశారు. ఆయన వద్ద ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. మధుసూదన్ రెడ్డి నివాసంతో పాటు ఆయన బంధువులు, సన్నిహితులు, బినామీలకు చెందిన ఏడు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సోదాల్లో దాదాపు రూ.7,83,35,302 విలువైన స్థిర, చరాస్తులను గుర్తించారు. వీటికి సంబంధించిన డాక్యుమెంట్లు, ఆస్తి పత్రాలు లభ్యమైనట్లు వెల్లడించారు. ఈసీఐఎల్ ప్రాంతంలో 300 చదరపు గజాల స్థలంలో నిర్మించిన ఒక మూడంతస్తుల భవనం, ఇబ్రహీంపట్నం మండలంలో ఒక ఓపెన్ ప్లాటు, ఒక ఎకరం వాణిజ్య భూమి, పరిగి మండలంలో 27 ఎకరాల వ్యవసాయ భూమి, అందులో స్విమ్మింగ్ పూల్, ఫామ్ హౌస్ ఉన్నట్లు గుర్తించారు. 1.2 కిలోల బంగారు ఆభరణాలు, మూడు ఖరీదైన కార్లు, రూ.9 లక్షల నగదును గుర్తించినట్లు ఏసీబీ తెలిపింది. ఏఆర్‌కే స్పిరిట్స్ పేరుతో మద్యం వ్యాపారంలో సుమారు రూ.80 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు గుర్తించారు. ఆయన భార్య, పిల్లల పేర్లతో రెండు షెల్ కంపెనీలను స్థాపించినట్లు ఏసీబీ గుర్తించింది. తదుపరి విచారణ కొనసాగుతోందని ఏసీబీ అధికారులు వెల్లడించారు.



## తిట్టి తిట్టి చంపేస్తున్నరు!

**సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించిన నిర్మాత ఎస్కేఎన్**

హైదరాబాద్, జనవరి 23 (ఈవార్తలు): ప్రముఖ సినీ నిర్మాత ఎస్కేఎన్, తన పేరుతో సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై తీవ్రంగా స్పందించారు. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు తన పేరుతో నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించి, సినిమాతో పాటు నటీనటులను లక్ష్యంగా చేసుకుని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ఆయన సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు. కొన్ని సోషల్ మీడియా హ్యాండిల్స్ తన పేరుతో, ఒక సినిమా గురించి, అందులోని నటీనటుల గురించి తప్పుదోవ పట్టించేలా, అవమానకరమైన వ్యాఖ్యలు పోస్ట్ చేస్తున్నాయని ఎస్కేఎన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగా గందరగోళం సృష్టించి, నెగెటివిటీని వ్యాప్తి చేయాలనే దురుద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్కేఎన్ హెచ్చరించారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ నకిలీ ఖాతాలను నిర్వహిస్తున్న వారిని గుర్తించే పనిలో ఉన్నట్లు తెలిసింది. తప్పుడు ప్రచారానికి పాల్పడిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఎస్కేఎన్ స్పష్టం చేశారు.




# ఎస్కేఎన్ఆర్ కాలేజీలో వసంత పంచమి వేడుకలు

జగిత్యాల టౌన్,జనవరి 23 (ఈవార్తలు): జగిత్యాలలోని ఎస్కేఎన్ఆర్ డిగ్రీ కాలేజీలో శుక్రవారం మాతృ వృక్షం, వసంత పంచమి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెంపొందించుకొని, ప్రతి జీవరాశిని గౌరవిస్తూ వాటిని కాపాడాలని తెలిపారు. వృక్షాలను సంరక్షిస్తే బావి తరాలకు స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చునని తెలిపారు. మానవ మనుగడకు కారణమైన వృక్ష , జంతు జాతులను సంరక్షిస్తూ ప్రకృతిని కాపాడాలని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఉన్న రావి చెట్టును మాతృ చెట్టుగా ప్రకటించారు. విద్యార్థులతో పుడమి తల్లి పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న. జగిత్యాల డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మహేష్ మాట్లాడుతూ మొక్కలను విరివిగా నాటుతూ పచ్చదనాన్ని పెంపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఆడెపు శ్రీనివాస్, గోవర్ధన్, సురేందర్ ,శ్రీనివాస్ అధ్యాపక బృందం విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ప్రగతి పాఠశాలలో ఘనంగా వసంత పంచమి వేడుకలు

రాయికల్, జనవరి 23 (ఈవార్తలు): వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని రాయికల్ పట్టణ కేంద్రంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో శ్రీ పంచమి వేడుకలు కన్నుల పండుగగా నిర్వహించారు. విద్య, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమక్షంలో భక్తిశ్రద్ధలతో సాగాయి. ఈ కార్యక్రమానికి జ్యోతిష్య జ్ఞానరత్న బ్రహ్మశ్రీ మునిగోటి రమేష్ శర్మ ఆధ్వర్యం వహించి అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం 9వ తరగతి, 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులు, మాతలతో కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తరువాత సామూహిక అక్షరాభ్యాస మహోత్సవం జరిపి, చిన్నారుల్లో విద్యాపట్ల ఆసక్తిని పెంపొందించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బాలే శేఖర్ మాట్లాడుతూ, 'విద్య అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా సంస్కారాలు, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలతో కూడిన సంపూర్ణ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాలి. అలాంటి లక్ష్యంతోనే ప్రగతి ఉన్నత పాఠశాల ప్రతి సంవత్సరం శ్రీ పంచమి వేడుకలను నిర్వహిస్తూ, విద్యార్థుల్లో జ్ఞానదీప్తిని వెలిగిస్తోంది. సామూహిక అక్షరాభ్యాసం వంటి కార్యక్రమాలు పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తాయి' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నర్సరీ నుండి పదవ తరగతి విద్యార్థులు ఎవరైతే కొత్తగా చేరారో వాళ్లకు ఫ్రీ అడ్మిషన్ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బాలె జయశ్రీ శేఖర్ ,పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. సంప్రదాయ పద్ధతుల్లో నిర్వహించిన ఈ శ్రీ పంచమి వేడుకలు అందరిలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాయి.

## బర్కత్‌పుర మా అడ్డా: బీజేపీ



హైదరాబాద్, జనవరి 23 (ఈవార్తలు): రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో అంబర్ పేట నియోజకవర్గం బర్కత్ పుర డివిజన్ నుంచి బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థిగా పార్టీ అధిష్టానం ఆదేశిస్తే తాను పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కోశాధికారి ఎ. సూర్యప్రకాష్ సింగ్ వెల్లడించారు. శుక్రవారం బర్కత్ పుర లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం ప్రచారం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని తెలిపారు. అంబర్ పేట్ నియోజకవర్గ పరిధి లోని బస్తీలు, కాలనీలతో పాటు అనేక ప్రాంతాల్లో బీజేపీని బలపర్చేందుకు గత 15 సంవత్సరాలుగా క్రియాశీలకంగా పనిచేస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు. పార్టీ కోసం చేసిన సేవలను గుర్తించిన బిజెపి అధిష్టానం తనను కార్పొరేటర్ అభ్యర్థిగా బరిలో దింపేందుకు సానుకూలంగా స్పందిస్తున్నట్లు తెలిపారు. బర్కత్ పుర డివిజన్ ప్రజల ఆశీస్సులతో తాను పోటీ చేసి ఘన విజయం సాధిస్తానని ఎ. సూర్యప్రకాష్ సింగ్ ధీమా వ్యక్తం చేశారు.

## తండ్రిపై బండ రాయితో కొడుకు దాడి

మల్యాల, జనవరి 23 (ఈవార్తలు) : మల్యాల కేంద్రానికి చెందిన పెరుమండ్ల సత్యనారాయణ (54)పై కొడుకు మనోజ్ బండరాయితో దాడికి పాల్పడ్డాడు. సత్యనారాయణకు ఇద్దరు భార్యలు కాగా, పెద్ద భార్య రుద్రంగిలో పిల్లలతో కలిసి ఉంటుంది. అయితే శుక్రవారం తండ్రి దగ్గరకు వచ్చిన మనోజ్ మద్యం మత్తులో బండరాయితో తలపై దాడి చేశాడు. దీంతో తీవ్ర రక్తస్రావంలో పడి ఉన్న సత్యనారాయణను స్థానికులు 108లో జగిత్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.



## ఉచిత మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్ ప్రారంభం

మల్లేపల్లి, జనవరి 23 (ఈవార్తలు):లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ (గ్రీన్ ల్యాండ్స్), సేవా భారతి, మెర్సీ మిషన్, రామ్‌కీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం నిర్వహిస్తున్న ఉచిత మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్‌కు మల్లేపల్లి లోని డా. ఈశ్వరచందర్ చారిటబుల్ హాస్పిటల్‌లో ఘనంగా శ్రీకారం చుట్టారు. క్యాంప్‌లో భాగంగా జనవరి 23న స్క్రీనింగ్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజున డా. సుదర్శన్ రెడ్డి, డా. గులాబీ రాణీలు మొత్తం 64 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్, డీసీపీ పరవస్తు మధుకర్ స్వామి గారు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ లక్ష్మికుమారి గారు మాట్లాడుతూ, లక్షల రూపాయల విలువ చేసే ప్లాస్టిక్ సర్జరీ చికిత్సను ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పేద ప్రజలకు అందించడం అభినందనీయమని ప్రశంసించారు. సమాజ సేవ పట్ల లయన్స్ క్లబ్, సేవా భారతి, మెర్సీ మిషన్ సభ్యుల అంకితభావం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ (గ్రీన్ ల్యాండ్స్) ప్రతినిధులు విద్యాభూషణ్, రఘునాథ రెడ్డి, రామ్‌కీ ఫౌండేషన్ నిర్వాహకులు రామిరెడ్డి, డా. సరస్వతి, దుర్గా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. క్యాంప్ ద్వారా మరింతమంది పేద, నిరుపేద రోగులకు ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు బోగస్: ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 23 (ఈవార్తలు): ఫోన్ ట్యాపింగ్ కేసు బోగస్ అని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) అన్నారు. బీఆర్ఎస్ నాయకులను ఇబ్బంది పెట్టడానికి మాత్రమే రూపొందించిన అక్రమ కేసు అని మండిపడ్డారు. 'కాంగ్రెస్ అవినీతి, అక్రమాలను ప్రశ్నించినందుకే హరీశ్, కేటీఆర్‌లను వేధిస్తున్నారు' అని ఫైర్ అయ్యారు. 'ఒక్క ఫోన్ కూడా ట్యాప్ కాలేదని పోలీసులు స్పష్టీకరించారు. రేవంత్ రెడ్డి అసత్యాల మీద ఈ కేసును నడిపిస్తున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను మర్చిపోయి, విచ్చలవిడి అవినీతి, దోపిడీకి పాల్పడుతున్న రేవంత్ రెడ్డి వాటిని కప్పిపుచ్చుకొనేందుకే మా నాయకులకు నోటీసులు ఇస్తున్నారు. గత రెండు సంవత్సరాల నుండి అవే లొట్టపీసు కేసులు, నోటీసుల పేరుతో టైమ్ పాస్ చేస్తున్నది కాంగ్రెస్ సర్కార్' అని ధ్వజమెత్తారు.

# హెల్త్ వర్కర్లకు అండగా ఉంటా

**ఐఎఫ్ఎంఎస్ పద్ధతిలో జీతాలు వచ్చేలా చూస్తా.. జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హామీ**



బంజారాహిల్స్/హైదరాబాద్, జనవరి 23 (ఈవార్తలు): హెల్త్ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్స్, సూపర్వైజర్స్ ఎస్పీఎస్ మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని బృందం కవితను కలిసి తమ సమస్యలను విన్నవించారు. దాదాపు 17 వేల మంది కార్మికులు చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్నారని తెలిపారు. అదీకాక, జీతాల చెల్లింపులు కూడా ఐఎఫ్ఎంఎస్ విధానంలో లేకపోవడం కూడా సమస్యగా మారిందని కవిత దృష్టికి తీసుకొచ్చారు. 'కనీస వేతనాలు రూ.26,000 ఇవ్వాలి. ప్రతి కార్మికుడిని ఐఎఫ్ఎంఎస్ విధానంలో తీసుకొని ఉద్యోగ భద్రత కల్పించాలి. మహిళా కార్మికులకు వేతనములతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలి. ప్రతి కార్మికుడికి డబల్ పీఎఫ్ రద్దుచేసి సింగిల్ పీఎఫ్ మాత్రమే కార్మికుడికి కటింగ్ చేయాలి. ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ తప్పనిసరి కట్టి కార్డు ఇవ్వాలి. ప్రమాదం జరిగితే రూ.5 లక్షలు అందించాలి' తదితర డిమాండ్ల లేఖను కవితకు అందజేశారు. ఈ సందర్భంగా.. సమస్యలపై డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కవిత హామీ ఇచ్చారని రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య తెలిపారు. ఆమెను కలిసిన వారిలో సైదయ్యతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్న బోస్క నరేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాతంగి అనిల్ కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి గొర్రె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్లోబల్ సానుకూల సంకేతాలు




ముంబై:దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు కూడా లాభాల బాటలో పయనిస్తున్నాయి. ఈరోజు ఉదయం ట్రేడింగ్ ప్రారంభమైనప్పటి నుంచి సూచీలు సానుకూలంగా కదులుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వస్తున్న సానుకూల సంకేతాలు దేశీయ సెంటిమెంట్‌కు దన్నుగా నిలిచాయి. ఇవాళ ఉదయం 9.30 గంటల సమయానికి సెన్సెక్స్ 132 పాయింట్ల లాభంతో 82,440 వద్ద ట్రేడ్ అవుతుండగా, నిఫ్టీ 52 పాయింట్లు పెరిగి 25,342 వద్ద కొనసాగుతోంది. బెంచ్‌మార్క్ సూచీలతో పాటు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు కూడా లాభాల్లోనే ఉన్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.32 శాతం, స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.24 శాతం మేర పెరిగాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 0.9 శాతానికి పైగా లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. అయితే, నిఫ్టీ మీడియా, పీఎస్‌యూ బ్యాంక్, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాలు స్వల్ప నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి. అమెరికా, ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియడం దేశీయ మార్కెట్లకు కలిసొచ్చింది. బ్యాంక్ ఆఫ్ జపాన్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచడంతో ఆసియా మార్కెట్లలో ఉత్సాహం కనిపించింది. జపాన్, చైనా, హాంకాంగ్, దక్షిణ కొరియా సూచీలన్నీ లాభాల్లోనే ఉన్నాయి. మరోవైపు దేశీయ మార్కెట్లలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐలు) అమ్మకాల ఒత్తిడిని కొనసాగిస్తుండగా, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐలు) కొనుగోళ్లతో మార్కెట్లకు అండగా నిలుస్తున్నారు. నిన్న ఒక్కరోజే ఎఫ్ఐఐలు నికరంగా రూ. 2,550 కోట్ల విలువైన షేర్లను విక్రయించగా, డీఐఐలు రూ. 4,223 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. నిఫ్టీకి 25,100-25,150 వద్ద తక్షణ మద్దతు లభించవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# భర్తతో సంసారం.. వద్దు బాబోయ్!

**తీవ్ర అసంతృప్తిలో జపాన్ మహిళలు**

టోక్యో: జపాన్‌లో వివాహ బంధంపై తాజాగా వెలువడిన ఓ సర్వే ఫలితాలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. సంప్రదాయాలకు పెద్దపీట వేసే జపాన్‌లోనే వివాహ జీవితంపై ఇంతటి అసంతృప్తి వ్యక్తమవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. జపనీస్ వివాహ సంబంధాల సంస్థ 'ప్రెసియా' నిర్వహించిన ఈ సర్వేలో, 20 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సు గల 287 మంది వివాహిత మహిళలు పాల్గొన్నారు. వారిని "మీరు మీ భర్తను వివాహం చేసుకున్నందుకు చింతిస్తున్నారా" అనే ఒక్క ప్రశ్న అడగగా, 70 శాతం మంది 'అవును' అని సమాధానమిచ్చారు. పెళ్లి చేసుకున్నందుకు జీవితంలో ఎప్పుడో ఒక సమయంలో అయినా బాధపడ్డామని వారు వెల్లడించారు. ఇందులో మరింత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... కాలం వెనక్కి తిరిగితే తమ ప్రస్తుత భర్తను మళ్లీ పెళ్లి చేసుకోబోమని 54 శాతం మంది మహిళలు స్పష్టం చేయడం. ఈ గణాంకాలు జపాన్‌లో వివాహ బంధం వెనుక ఉన్న వాస్తవాలను బయటపెడుతున్నాయని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

**అసంతృప్తికి కారణాలివే:**

**ఆర్థిక పరిస్థితులే తమ అసంతృప్తికి ప్రధాన కారణమని 37.2 శాతం మంది మహిళలు తెలిపారు.**

**తాము ఆశించిన దానికంటే తక్కువ ఆదాయం ఉన్న వ్యక్తిని పెళ్లి చేసుకున్నామని 22.6 శాతం మంది పేర్కొన్నారు.**

**భర్తలకు సరైన ఆర్థిక అవగాహన లేదని 14.6 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు.**

**ఇంటిపనుల్లో భర్త సహకరించకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని 11.11 శాతం మంది తెలిపారు.**

# చంద్రబాబు పేషీ పేరుతో మోసాలు.. ఇద్దరి అరెస్ట్

అమరావతి, జనవరి 23 (ఈవార్తలు): ఏపీలో ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో అమాయకులను మోసం చేస్తున్న ముఠాలు పేట్రేగిపోతున్నాయి. ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పేషీ పేరునే వాడుకుంటూ లక్షలు దండుకుంటున్న ఉదంతం తాజాగా అనకాపల్లి జిల్లాలో వెలుగుచూసింది. డీఎస్సీలో ఎస్జీటీ పోస్టు ఇప్పిస్తామని నమ్మించి ఓ మహిళ నుంచి రూ.12 లక్షలకు పైగా వసూలు చేసిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రోలుగుంట మండలానికి చెందిన ఓ మహిళకు ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం ఇప్పిస్తామని నిందితులు నమ్మించారు. ప్రధాన నిందితుడు ప్రకాశం జిల్లా నాయుడుపాలెం గ్రామానికి చెందిన ఎర్రగొర్ల శ్రీను కాగా, ఇతనికి విజయవాడకు చెందిన షేక్ సలీం సహకరించాడు. తనకు సీఎం చంద్రబాబు పేషీలో ఉన్నతాధికారులతో సన్నిహిత పరిచయాలు ఉన్నాయని, కచ్చితంగా ఉద్యోగం ఇప్పిస్తానని శ్రీను బాధితురాలిని మభ్యపెట్టాడు. ఇది నమ్మిన సదరు మహిళ నుంచి నిందితులు విడతలవారీగా రూ.12 లక్షలకు పైగా నగదు వసూలు చేసి మోసగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ.. ప్రధాన నిందితుడు ఎర్రగొర్ల శ్రీను పాత నేరస్తుడని వెల్లడించారు. గతంలో కూడా ఇతను ఎస్సై, లైన్‌మెన్ ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురిని మోసం చేసిన చరిత్ర ఉందని తెలిపారు. ఈ కేసులో ఇంకా ఎవరైనా బాధితులు ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎవరైనా ఉద్యోగాల పేరుతో డబ్బులు అడిగితే నమ్మవద్దని, వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ ప్రజలకు సూచించారు.

## చంద్రబాబుతో టైమ్ 100 డిన్నర్: స్మృతి ఇరానీ

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి దావోస్ లో 'టైమ్ 100 ఇంపాక్ట్ డిన్నర్'కు హాజరవడం సంతోషంగా ఉందని కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. మంగళవారం నాడు జరిగిన ఈ కార్యక్రమంపై ఆమె సోషల్ మీడియాలో ఒక పోస్ట్ ద్వారా తన అభిప్రాయాలను పంచుకున్నారు. భవిష్యత్తుకు తగ్గ పాలన, సాంకేతికత ఆధారిత పరిష్కారాలు, ఆవిష్కరణల వ్యవస్థల ద్వారా భారతదేశ తదుపరి దశ అభివృద్ధిని ఎలా తీర్చిదిద్దాలనే అంశంపై ఈ డిన్నర్‌లో ప్రధానంగా చర్చ జరిగిందని ఆమె పేర్కొన్నారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నుంచి మొదలుకొని భవిష్యత్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించడం వరకు అనేక ముఖ్యమైన విషయాలు ప్రస్తావనకు వచ్చినట్లు స్మృతి ఇరానీ వివరించారు. విధానపరమైన దార్శనికతకు, క్షేత్రస్థాయిలో కార్యాచరణ సామర్థ్యాన్ని జోడించడం ఎంత ముఖ్యమో ఈ చర్చ నొక్కి చెప్పిందన్నారు. "వికసిత భారత్ లక్ష్యం వైపు మనం అడుగులు వేస్తున్నప్పుడు, దేశ పోటీతత్వం కొన్ని కీలక అంశాలపై ఆధారపడి ఉంటుంది. విశ్వాసంతో సాంకేతికతను, సమ్మిళితత్వంతో ఆవిష్కరణలను, సంస్థాగత బలంతో ఆశయాలను ఏకీకృతం చేయగలగాలి" అని స్మృతి ఇరానీ తన పోస్ట్‌లో స్పష్టం చేశారు. ఈ చర్చ భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో విధాన రూపకల్పన, అమలు ప్రాముఖ్యతను తెలియజేసిందని ఆమె పేర్కొన్నారు.

## ముగిసిన మిథున్ రెడ్డి ఈడీ విచారణ

హైదరాబాద్, జనవరి 23 (ఈవార్తలు): ఏపీ మద్యం కుంభకోణం (ఏపీ లిక్కర్ స్కామ్) కేసులో దర్యాప్తు మరింత వేగవంతమైంది. ఈ కేసులో భాగంగా వైసీపీ రాజంపేట ఎంపీ పి.వి. మిథున్ రెడ్డి శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్‌లోని ఈడీ జోనల్ కార్యాలయంలో ఆయనను అధికారులు సుమారు ఏడు గంటల పాటు సుదీర్ఘంగా ప్రశ్నించి, కీలక వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో (2019-2024) మద్యం విధానంలో చోటుచేసుకున్న అక్రమాలు, నిధుల మళ్లింపు ఆరోపణలపై ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గతంలోనే మిథున్ రెడ్డికి సమన్లు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆయన ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. మద్యం విధాన రూపకల్పన, డిస్టిలరీలతో సంబంధాలు, నిధుల లావాదేవీల వంటి పలు కీలక అంశాలపై అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలుస్తోంది. విచారణ ముగిసిన అనంతరం బయటకు వచ్చిన మిథున్ రెడ్డి మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు. ఈ కేసుకు సంబంధించి కోర్టు ఆదేశాలు ఉన్నందున తాను ఎలాంటి వివరాలు వెల్లడించలేనని స్పష్టం చేసి, అక్కడి నుంచి నేరుగా తన నివాసానికి వెళ్లిపోయారు. గతంలో ఏపీ పోలీస్ సిట్ ఇదే కేసులో మిథున్ రెడ్డిని ఏ5 నిందితుడిగా చేర్చి అరెస్టు చేసింది. ప్రస్తుతం ఆయన బెయిల్‌పై ఉన్నారు. ఈ కేసులో రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డిని గురువారం దాదాపు ఏడు గంటల పాటు విచారించిన మరుసటి రోజే మిథున్ రెడ్డిని విచారించడం ప్రాధాన్యత సంతరించుకుంది.



# ఇరాన్‌పై యుద్ధ మేఘాలు

## భారీగా ఆయుధాలు తరలిస్తున్న అమెరికా

టెహ్రాన్: మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయా అంటే అవుననే సంకేతాలు వెలువడుతున్నాయి. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో పాల్గొన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇరాన్ లక్ష్యంగా మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ తమ అణు కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తే, అమెరికా నుంచి మరోసారి భీకర దాడులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. అణు ఆయుధాల తయారీకి ఇరాన్ ప్రయత్నిస్తే సహించేది లేదని, అవసరమైతే సైనిక చర్యకు వెనుకాడబోమని ట్రంప్ తేల్చిచెప్పారు. ట్రంప్ హెచ్చరికలకు తగ్గట్టుగానే క్షేత్రస్థాయిలో అమెరికా సైనిక కదలికలు వేగవంతమయ్యాయి. అత్యాధునిక యుఎస్ఎస్ అబ్రహం లింకన్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ స్ట్రైక్ గ్రూప్‌ను అమెరికా అరేబియన్ సముద్రం/పర్షియన్ గల్ఫ్ దిశగా తరలిస్తోంది. దీనికి తోడు ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగల్ జెట్‌లు, గగనతలంలోనే ఇంధనం నింపే కేసీ-135 ఎయిర్‌క్రాఫ్ట్‌లను అమెరికా సిద్ధం చేసింది. ఇరాన్ క్షిపణి దాడులను సమర్థంగా ఎదుర్కొనేందుకు థాడ్, పేట్రియాట్ వంటి శక్తివంతమైన యాంటీ మిస్సైల్ సిస్టమ్స్‌ను మధ్యప్రాచ్యంలో మోహరించారు. ఇజ్రాయెల్, ఖతార్ వంటి మిత్రదేశాల్లో కూడా రక్షణ వ్యవస్థలను అమెరికా మరింత పటిష్టం చేయడం గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతకు అద్దం పడుతోంది. గత ఏడాది జూన్‌లో అమెరికా ఇరాన్ అణు కేంద్రాలపై దాడులు జరిపిన సంగతి తెలిసిందే. ఫోర్డో అణు కేంద్రంపై జరిగిన బంకర్ బస్టర్ దాడుల తర్వాత అక్కడి నుంచి సుమారు 400 కిలోల సుసంపన్న యురేనియం అదృశ్యమైందన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత ఏడు నెలలుగా అంతర్జాతీయ అణు శక్తి సంస్థ తనిఖీలు నిలిచిపోవడంతో ఇరాన్ రహస్యంగా అణు ఆయుధాలను తయారు చేస్తోందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి.

### ట్రంప్ వ్యాఖ్యలు అబద్ధం: ఇరాన్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ ఖండించింది. తన జోక్యం వల్లే ఇరాన్‌లో 800 మందికిపైగా నిరసనకారుల ఉరిశిక్షలు ఆగిపోయాయని ట్రంప్ పేర్కొనడంపై ఇరాన్ న్యాయవ్యవస్థకు చెందిన అగ్ర ప్రాసిక్యూటర్ మొహమ్మద్ మొవాహెది తీవ్రంగా స్పందించారు. ట్రంప్ వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధాలని ఆయన స్పష్టం చేశారు. నిరసనకారులకు సామూహికంగా మరణ శిక్షలు విధించాలనే నిర్ణయమే ఇరాన్ ప్రభుత్వం ఎప్పుడూ తీసుకోలేదని మొవాహెది తెలిపారు. ఎవరికీ ఉరిశిక్షలు విధించలేదని, అరెస్టయిన వారి సంఖ్య కూడా ట్రంప్ చెప్పినంత పెద్దగా లేదన్నారు. ఈ విషయంలో తప్పుడు వార్తలు, తప్పుదారి పట్టించే ప్రకటనలు ప్రచారం చేయొద్దని అంతర్జాతీయ మీడియాను ఆయన కోరారు. ఇదే అంశంపై ట్రంప్ గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఇరాన్‌లో వందల మంది నిరసనకారులకు విధించబోయే ఉరిశిక్షలను అమెరికా ఒత్తిడి కారణంగా అక్కడి అధికారులు రద్దు చేశారని వ్యాఖ్యానించారు. తాను జోక్యం చేసుకోకపోయి ఉంటే 800 మందికి పైగా ప్రాణాలు కోల్పోయేవని, తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో ఇరాన్ పాలకవర్గం వెనక్కి తగ్గిందని ట్రంప్ తెలిపారు. అయితే, ఈ వ్యాఖ్యలను ఇరాన్ ప్రభుత్వం పూర్తిగా ఖండిస్తూ, అవి వాస్తవానికి దూరమని స్పష్టం చేసింది.

# సైనిక చర్య తప్పదు

### హమాస్‌కు ట్రంప్ వార్నింగ్



గాజా: గాజా అంశంలో హమాస్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఆయుధాలు వదిలిపెట్టేందుకు అంగీకరించకపోతే సైనిక చర్య తప్పదని స్పష్టంగా తేల్చిచెప్పారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల సందర్భంగా, గాజాలో శాంతి స్థాపన లక్ష్యంగా 35 దేశాల మద్దతుతో 'శాంతి మండలి'ని ట్రంప్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ట్రంప్, హమాస్ నిరాయుధీకరణ విషయంలో ఏ మాత్రం రాజీ ఉండదన్నారు. కొత్తగా రూపొందించిన శాంతి మార్గదర్శకాల్లో ఇది మొదటి అజెండా అని తెలిపారు. ఆయుధాలు వదిలే వరకు ఒత్తిడి కొనసాగుతుందని, అంగీకారం రాకపోతే సైనిక చర్యకు వెనుకాడబోమని హెచ్చరించారు. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక యుద్ధాలకు ముగింపు పలికానని, త్వరలోనే మరో కీలక పరిష్కారం వెలుగులోకి వస్తుందని వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్ యుద్ధం విషయానికి వస్తే, దాన్ని పరిష్కరించడం ఇప్పటివరకు అత్యంత క్లిష్టమైన సమస్యగా మారిందని ట్రంప్ చెప్పారు. అయితే గాజాలో శాంతి సాధనకు ఈ కొత్త శాంతి మండలి కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు, ఆహ్వానం ఉన్నప్పటికీ భారత్ సహా కొన్ని కీలక దేశాలు ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నాయి. అయితే ఈ చార్టర్‌పై సంతకం చేసిన దేశాల్లో పాకిస్థాన్ కూడా ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది. గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం అమలు, భద్రత సమన్వయం, పునర్నిర్మాణం వంటి అంశాల పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన ఈ శాంతి మండలికి ప్రారంభ చైర్మన్‌గా ట్రంప్ వ్యవహరిస్తారని ప్రకటించారు. బహ్రెయిన్, మొరాకో, అజర్‌బైజాన్ నాయకులతో కలిసి ఆయన చార్టర్‌పై సంతకాలు చేశారు. ఈ మండలి గొప్ప విజయాలు సాధించగల సామర్థ్యం ఉందని, దీనికి నాయకత్వం వహించడం తనకు గర్వకారణమని ట్రంప్ పేర్కొన్నారు. గాజా పునర్నిర్మాణంలో శాంతి మండలి కీలక పాత్ర పోషిస్తుందని, అయితే ఇందుకు ఐక్యరాజ్యసమితితో (యూఎన్) కలిసి పనిచేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. గతంలో యూఎన్‌పై విమర్శలు చేసిన ట్రంప్, ఈ సందర్భంలో మాత్రం సమన్వయంతో ముందుకెళ్లాలని పిలుపునివ్వడం విశేషం. ఈ శాంతి మండలి ఏర్పాటు ప్రకాశవంతమైన పశ్చిమాసియా దిశగా వేసిన తొలి అడుగు అని ఆయన అభివర్ణించారు. శాంతి మండలి ఏర్పాటుపై అంతర్జాతీయంగా మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చేరే అవకాశాలపై ఆందోళనతో బ్రిటన్ ఈ మండలిలో చేరేందుకు నిరాకరించింది. నార్వే, స్వీడన్ కూడా దూరంగా ఉండనున్నట్లు సంకేతాలు ఇచ్చాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయెల్ మాక్రాన్ పాల్గొనడాన్ని తిరస్కరించడంతో, ఫ్రెంచ్ వైన్‌పై 200 శాతం సుంకం విధిస్తామని ట్రంప్ గతంలో హెచ్చరించిన విషయం చర్చనీయాంశమైంది. మరోవైపు, భాగస్వామ్య దేశాలతో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని రష్యా ప్రకటించింది.





న్యూఢిల్లీ: ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ యమహా మోటార్ ఇండియా ఓ కీలక ప్రకటన చేసింది. తమ పాపులర్ 125 సీసీ స్కూటర్లలో బ్రేక్ భాగానికి సంబంధించిన లోపం కారణంగా 3 లక్షలకు పైగా వాహనాలను స్వచ్ఛందంగా రీకాల్ చేస్తున్నట్లు ప్రకటించింది. రే జెడ్‌ఆర్ 125 ఎఫ్ఐ హైబ్రిడ్, ఫ్యాసినో 125 ఎఫ్ఐ హైబ్రిడ్ మోడళ్లను వెనక్కి పిలుస్తున్నట్లు తెలిపింది. కంపెనీ వెల్లడించిన వివరాల ప్రకారం, మొత్తం 3,06,635 స్కూటర్లపై ఈ రీకాల్ ప్రభావం చూపనుంది. 2024 మే 2 నుంచి 2025 సెప్టెంబర్ 3 మధ్య కాలంలో తయారైన వాహనాల్లో ఈ సమస్యను గుర్తించినట్లు యమహా పేర్కొంది. ఈ స్కూటర్లలోని ఫ్రంట్ బ్రేక్ కాలిపర్‌లో లోపం ఉన్నట్లు, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో దీని పనితీరు మందగించే అవకాశం ఉందని వివరించింది. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందునే ఈ రీకాల్ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. సమస్య ఉన్నట్లు గుర్తించిన వాహనాల యజమానులకు వ్యక్తిగతంగా సమాచారం అందిస్తామని తెలిపింది. వారు తమ సమీపంలోని యమహా ఆథరైజ్డ్ షోరూంను సంప్రదించి, లోపమున్న బ్రేక్ భాగాన్ని ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగా మార్చుకోవచ్చని సూచించింది. ఈ రీకాల్ ప్రక్రియ తక్షణమే అమల్లోకి వచ్చినట్లు యమహా ఇండియా తెలిపింది. వినియోగదారుల భద్రతకే తమ మొదటి ప్రాధాన్యత అని, అందుకు కట్టుబడి ఉన్నామని కంపెనీ పునరుద్ఘాటించింది

# యమహా యూ టర్న్



# యూనస్ దేశ ద్రోహి

### బంగ్లాదేశ్‌లో పరిస్థితులు దారుణం

### భయం, విధ్వంసం గుప్పిట్లో దేశం

### హింసాత్మక పాలనను అంతం చేయాలి:షేక్ హసీనా



న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ తాత్కాలిక పాలకుడు మహ్మద్ యూనస్ దేశాన్ని అరాచకంలోకి నెట్టివేస్తున్నారని ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ ప్రజాస్వామ్యం ఇప్పుడు రక్తంతో తడిసి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశం చీకటి రోజుల్లో ఉందని ఆమె అన్నారు. బంగ్లాదేశ్‌లో పరిస్థితులు అత్యంత దారుణంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు శాంతియుత దేశంగా ఉన్న బంగ్లాదేశ్ ఇప్పుడు తీవ్రమైన హింస, భయం, విధ్వంసాన్ని ఎదుర్కొంటోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో ఏడాదిన్నర క్రితం జరిగిన కుట్ర తర్వాత దేశం భయాందోళనలకు గురైందని అన్నారు. ఎక్కడ చూసినా అణిచివేత ఉందని, స్వేచ్ఛ కనుమరుగైందని ఆమె మండిపడ్డారు. సంస్థలు బలహీనపడగా, మతతత్వ శక్తులు రెచ్చిపోతున్నాయని విమర్శించారు. మహిళలపై హింస, లైంగిక వేధింపులు విపరీతంగా పెరిగాయని ఆమె ఆరోపించారు. బంగ్లాదేశ్ ఇప్పుడు రక్తంతో తడిసిన ప్రాంతంగా మారిందని వాపోయారు. సంక్షోభ సమయంలో రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడానికి, హింసాత్మక పాలనకు ముగింపు పలకడానికి పోరాటం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. దక్షిణాసియా ఫారెన్ కరస్పాండెట్స్ క్లబ్ ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ఈ మేరకు ఆడియో సందేశం ఇచ్చారు.



## కేరళలో మార్పు వచ్చేస్తోంది: మోదీ

తిరువనంతపురం: గుజరాత్‌లో బీజేపీ విజయం ఒక నగరం నుంచి ప్రారంభమైందని, అదే తరహా విజయం కేరళలోనూ పునరావృతమవుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇటీవల తిరువనంతపురం నగరంపాలక సంస్థ ఎన్నికల్లో బీజేపీ సాధించిన అద్భుత విజయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా తిరువనంతపురంలో నిర్వహించిన ర్యాలీలో ప్రసంగిస్తూ, కేరళలో మార్పు అనివార్యమని ఆయన జోస్యం చెప్పారు. కేరళలో అధికారంలో ఉన్న లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్), కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్)ల అవినీతిని అంతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలు రాష్ట్ర రాజకీయ పరిస్థితులను పూర్తిగా మార్చివేస్తాయని ఆయన అన్నారు. ఇప్పటివరకు కేవలం రెండు కూటములను మాత్రమే చూశారని ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్‌లను ఉద్దేశించి విమర్శించారు. ఈ రెండు కూటములు రాష్ట్రాన్ని నాశనం చేశాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేరళ ప్రజలు మూడో ప్రత్యామ్నాయం వైపు చూస్తే అభివృద్ధి, సుపరిపాలన సాధ్యమవుతాయని బీజేపీని ఉద్దేశించి అన్నారు. ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్‌ల జెండాలు మాత్రమే వేరని, వారి అజెండా మాత్రం ఒక్కటేనని ఆయన విమర్శించారు. ప్రజల అభివృద్ధికి తోడ్పడే ప్రభుత్వం ఇప్పుడు అవసరమని, ఆ బాధ్యతను బీజేపీ తీసుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు. బీజేపీపై నమ్మకం ఉంచి కేరళ ప్రజలు తమతో కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. "శబరిమలలో జరిగిన బంగారం దొంగతనంపై విచారణ జరిగేలా చూడటం ఈ మోదీ హామీ" అని ఆయన వ్యాఖ్యానించారు.



### కేరళలో కొత్త రైళ్లకు పచ్చజెండా

ప్రధాని నరేంద్ర మోదీ కేరళలో కొత్త రైల్వే సేవలకు ఈరోజు పచ్చజెండా ఊపారు. తిరువనంతపురం నుంచి మూడు కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు ఒక ప్యాసింజర్ రైలును ఆయన ప్రారంభించారు. దేశంలో రైల్వే కనెక్టివిటీని ఆధునికీకరించే ప్రయత్నాల్లో భాగంగా ఈ కొత్త సర్వీసులను అందుబాటులోకి తెచ్చారు. కొత్తగా ప్రారంభించిన వాటిలో తిరువనంతపురం-చర్లపల్లి, నాగర్‌కోయిల్-మంగళూరు, తిరువనంతపురం-తాంబరం అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. వీటితో పాటు త్రిస్సూర్-గురువాయూర్ మధ్య కొత్త ప్యాసింజర్ రైలును కూడా ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం ఈ రైళ్లు తమ గమ్యస్థానాలకు బయలుదేరాయి. ఈ నాలుగు సర్వీసులను దక్షిణ రైల్వే నిర్వహించనుంది. తిరువనంతపురం-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ ప్రయాణిస్తుంది. ఇది తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చనుంది. అలాగే, తిరువనంతపురం-తాంబరం రైలు తమిళనాడులోని పారిశ్రామిక, విద్యా కేంద్రాలకు అనుసంధానంగా ఉంటుంది. అమృత్ భారత్ రైళ్లను సామాన్యులకు తక్కువ ధరలో మెరుగైన సౌకర్యాలు అందించేలా రూపొందించారు. ఇవి నాన్-ఏసీ రైళ్లు అయినప్పటికీ, వీటిలో ప్రయాణికుల భద్రత కోసం ప్రతి కోచ్‌లో సీసీటీవీ కెమెరాలు, ప్రతి సీటుకు ఫోన్ చార్జర్ సాకెట్, బాటిల్ హోల్డర్ వంటి వసతులు కల్పించారు. కోచ్‌లు విశాలంగా, సౌకర్యవంతంగా ఉన్నాయని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు. సంప్రదాయ రైళ్లకు, ప్రీమియం రైళ్లకు మధ్య అంతరాన్ని తగ్గించి, తక్కువ ఛార్జీలతో మెరుగైన ప్రయాణ అనుభూతిని అందించడమే ఈ రైళ్ల లక్ష్యమని రైల్వే అధికారులు తెలిపారు.

## కాంగ్రెస్ సభకు శశిథరూర్ ఆబ్సెంట్

న్యూఢిల్లీ: కేరళ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో ఒక ముఖ్యమైన సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి రాష్ట్రానికి చెందిన ప్రముఖ నాయకుడు శశిథరూర్ గైర్హాజరు కావడం చర్చనీయాంశమైంది. ఎన్నికల వ్యూహాలను రూపొందించే క్రమంలో జరిగిన ఈ సమావేశానికి ఆయన హాజరు కాకపోవడం పార్టీ వర్గాల్లో పలు ఊహాగానాలకు తావిచ్చింది. ఆయన వ్యవహారశైలిపై అధిష్ఠానం కొంతకాలంగా అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. శశిథరూర్ ఈ సమావేశానికి వర్చువల్‌గా హాజరవుతారని తొలుత ఆయన సన్నిహిత వర్గాలు తెలిపినప్పటికీ, మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమైన సమావేశంలో ఆయన పాల్గొనలేదు. కోజీకోడ్‌లో ఒక సాహిత్య కార్యక్రమంలో పాల్గొనవలసి ఉండటం వల్ల, ఇదివరకే ఖరారైన కార్యక్రమాల కారణంగా ఆయన హాజరు కాలేదని సన్నిహత వర్గాలు చెబుతున్నాయి. అయితే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ... థరూర్ నియోజకవర్గమైన తిరువనంతపురంలో పర్యటిస్తున్న సమయంలో ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. గత కొంతకాలంగా శశిథరూర్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై, కేంద్ర ప్రభుత్వంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. దీనితో ఆయన తీరుపై పార్టీ అధిష్ఠానం అసంతృప్తితో ఉంది. రాష్ట్ర నాయకులు కూడా ఆయను పార్టీ వ్యవహారాల్లో పక్కన పెడుతున్నారని తెలుస్తోంది. ఇటీవల కొచ్చిలో జరిగిన ఒక కార్యక్రమంలో రాహుల్ గాంధీ తనతో సరిగా వ్యవహరించలేదని శశిథరూర్ మనస్తాపానికి గురైనట్లు సమాచారం. ఈ విషయాన్ని ఆయన అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది

## మంచులో 12 మంది.. కాపాడిన పోలీసులు

ఉధంపూర్: జమ్మూకశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో భారీ హిమపాతంలో చిక్కుకుపోయిన 12 మందిని పోలీసులు సురక్షితంగా కాపాడారు. బాధితుల్లో మహిళలు, పిల్లలు కూడా ఉన్నారు. ప్రతికూల వాతావరణం కారణంగా చోంచ్రు గల్లా ప్రాంతంలో కొందరు స్థానికులు మంచులో చిక్కుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వివరాల్లోకి వెళితే.. చోంచ్రు గల్లా ప్రాంతానికి సుమారు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న సంఘ్ పోలీస్ పోస్టుకు అత్యవసర సహాయం కోసం ఫోన్ కాల్ వచ్చింది. వెంటనే స్పందించిన పోలీసులు, ఘటనా స్థలానికి బయలుదేరారు. దట్టమైన మంచు, క్లిష్టమైన మార్గంలో సుమారు మూడు గంటల పాటు ప్రయాణించి, చిక్కుకుపోయిన వారి వద్దకు చేరుకున్నారు. పోలీసులు వృద్ధులను చేతులు పట్టుకుని సురక్షితంగా నడిపిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ రెస్క్యూ ఆపరేషన్ విజయవంతమైనట్లు ఉధంపూర్ పోలీసులు 'ఎక్స్' వేదికగా తెలిపారు. "బసంత్‌గఢ్ ఎగువ ప్రాంతాలలో భారీ హిమపాతం కారణంగా చిక్కుకుపోయిన 12 మందిని ఉధంపూర్ పోలీసులు విజయవంతంగా రక్షించారు" అని పోస్ట్ చేశారు. బాధితులందరినీ పోలీస్ పోస్టుకు తరలించి, వారికి ఆహారం, ఆశ్రయం, వైద్య సహాయం అందించారు. మరోవైపు భారీ హిమపాతం, వర్షాల కారణంగా ఉధంపూర్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు శుక్రవారం సెలవు ప్రకటించారు.

వయ్యారి చిత్రం







## ఓం శాంతి ఓం ట్రైలర్ రిలీజ్

డైరెక్టర్ గా తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న తరుణ్ భాస్కర్ ఇప్పుడు హీరోగా మరోసారి ప్రేక్షకులను పలకరించబోతున్నారు. ఆయన హీరోగా, ఈషా రెబ్బ హీరోయిన్ గా నటించిన తాజా చిత్రం ఓం శాంతి శాంతి శాంతిః. మలయాళంలో సూపర్ హిట్ గా నిలిచిన జయ జయ జయ జయహే సినిమాకు రీమేక్ గా తెరకెక్కుతున్న ఆ మూవీకి ఏఆర్ సజీవ్ దర్శకత్వం వహిస్తున్నారు. జనవరి 30న థియేటర్లలో విడుదల కానున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. అయితే ప్రమోషన్స్ లో భాగంగా తాజాగా సినిమా ట్రైలర్ ను విడుదల చేశారు మేకర్స్. టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ సోషల్ మీడియా ద్వారా ట్రైలర్ రిలీజ్ చేయడం విశేషం. సినిమా మంచి విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. అయితే ట్రైలర్ విడుదలైన వెంటనే ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. మొదటి నుంచి చివరి వరకు కూడా ఫన్నీగా సాగిన ట్రైలర్ మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. ట్రైలర్ చూస్తే, సినిమా కథ భార్యాభర్తల మధ్య జరిగే సంఘటనలు చుట్టూ తిరుగుతుందని అర్థమవుతోంది. కోపం ఎక్కువగా ఉండే యువకుడితో పెళ్ళైన అమ్మాయి పరిస్థితి, ఆ తర్వాత ఆమె ఎదుర్కొనే సమస్యలు, భర్త ప్రవర్తనను ఎలా మార్చుకుంటుందన్నదే కథాంశం. కామెడీతో పాటు ఎమోషన్స్ కూడా బాగా మేళవించినట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా భార్యపై భర్త డామినేషన్ చేయడం, ఆ తర్వాత జరిగే పరిణామాలు నవ్వులు పూయిస్తున్నాయి.



## వెంకీకి ఎంత ఇవ్వాలన్నా మాకు ఓకే

మెగాస్టార్ చిరంజీవి- విక్టరీ వెంకటేష్ కాంబినేషన్‌లో వచ్చిన మన శంకర వరప్రసాద్ గారు 2026 సంక్రాంతి బాక్సాఫీస్ వద్ద క్లీన్ బ్లాక్ బస్టర్ గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ చిత్రం సైలెంట్ గా 400కోట్ల క్లబ్‌లో అడుగుపెడుతోంది. పరిమిత సమయం, మధ్యస్త బడ్జెట్‌తో రూపొందించిన ఈ చిత్రం భారీ లాభాలివ్వడంతో పంపిణీ వర్గాలు సహా నిర్మాతలు ఫుల్ హ్యాపీగా ఉన్నారు. అయితే ఈ సినిమాలో నటించిన వెంకటేష్ కి నిర్మాతలు ఎంత పారితోషికం అందజేసారు అనేది సస్పెన్స్ గా ఉంది. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం.. వెంకటేష్ సాధారణంగా తన సినిమాలకు రూ. 12 కోట్ల నుండి రూ. 15 కోట్ల వరకు పారితోషికం తీసుకుంటారు. అయితే సుస్మిత కొణిదెల సినిమాకు సంబంధించి రూ. 15 కోట్లు పారితోషికంతో పాటు సినిమా లాభాల్లో కూడా కొంత వాటా ఉండేలా అగ్రిమెంట్ జరిగిందని కథనాలొచ్చాయి. మెగా ఫ్యామిలీతో వెంకటేష్‌కు ఉన్న సన్నిహిత సంబంధాలతో పాటు, కథ నచ్చడంతో వెంకీ ఈ ప్రాజెక్టుకు ఓకే చెప్పారు. పారితోషికం విషయంలో ఆయన పెద్దగా పట్టుబట్టకుండా, మార్కెట్ ధర ప్రకారమే తీసుకున్నట్లు కథనాలొచ్చాయి.

## నిహారిక రాకాస గ్లింప్స్ రిలీజ్

మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా తనదైన ముద్ర వేస్తున్నారు. సొంత నిర్మాణ సంస్థ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ద్వారా ఇప్పటికే కమిటీ కుర్రోళ్లు వంటి బ్లాక్ బస్టర్ చిత్రాన్ని అందించిన నిహారిక.. ఇప్పుడు రెండో ప్రాజెక్ట్ గా రాకాస అనే సినిమాను ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. జీ స్టూడియోస్ భాగస్వామ్యంతో రూపొందుతున్న ఆ చిత్రం ప్రస్తుతం టాలీవుడ్ లో ఆసక్తికరంగా మారింది. యంగ్ హీరో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటిస్తున్న ఆ సినిమాకు మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ పోస్టర్ మంచి హైప్ ను క్రియేట్ చేయగా, తాజాగా మేకర్స్ గ్లింప్స్ విడుదల చేసి అంచనాలు పెంచారు. 'యుగయుగాలుగా ప్రతీ కథలో ఒక సమస్య.. ఆ సమస్యను ఛేదించడానికి ఓ వీరుడు పుడతాడు.. ఆ వీరుడు ఎవరో అని తెలిసేలోపే నిశ్శబ్దంగా పని ముగిస్తాడు.. ఈ కథలో ఆ వీరుడు నేనే' అంటూ ఓ రేంజ్ లెవెల్ ఎలివేషన్ ఇస్తూ గ్లింప్స్ సాగింది. చీకటి నిండిన గుహలో చేతిలో కాగడాతో ఎవరో నడుస్తున్నట్లు చూపిస్తూ మిస్టరీ వాతావరణాన్ని సృష్టించారు. ఆ తర్వాత వలలో చిక్కుకున్న సంగీత్ శోభన్ ఎంట్రీ ఇస్తారు. "ఇప్పుడే వచ్చాను కదరా.. అప్పుడే పైకి లేపేశారేంటి" అంటూ ఫన్నీగా డైలాగ్ చెబుతూ నవ్వులు పూయిస్తారు. చివర్లో వెలుతురు మధ్య నుంచి ఆయుధం కనిపించడంతో గ్లింప్స్ ముగుస్తుంది. ప్రస్తుతం గ్లింప్స్ నెట్టింట వైరల్ గా మారింది.




## నా తల్లి నుంచి ఇబ్బందులు ఎదుర్కొన్నా

బాలీవుడ్ నటి సయానీ గుప్తా గురించి పరిచయం అసవరం లేదు. సినిమా- వెబ్ సిరీస్‌లలో విలక్షణమైన నటనతో ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించిన నటి. అమ్మడు కేవలం నటి మాత్రమే కాదు. అవసరమైతే గొంతు సవరించి గాయనిగా మారిపోతుంది. ఇండస్ట్రీకి రాక ముందే సంగీతం -నృత్యంలో ప్రత్యేక శిక్షణ తీసుకుంది. థియేటర్ ఆర్టిస్ట్‌గా ప్రారంభమై సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. మార్గరీటా విత్ ఎ స్ట్రా సినిమాలో ఖాన్మ్ పాత్రతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అటుపై ప్యాన్ సినిమాలో షారుక్ ఖాన్ తో కలిసి తెరను పంచుకుంది. అక్షయ్ కుమార్, ఆయుష్మాన్ ఖురానా రణబీర్ కపూర్ లాంటి స్టార్లతోనూ కలిసి పనిచేసింది. అయితే సినిమాల్ని మించి ఓటీటీలతో వరల్డ్ అంతా ఫేమస్ అయింది. ఫోర్ మోర్ షాట్స్ ప్లీజ్ లో అంజనా మీనన్ అనే లాయర్ పాత్ర తో బాగా పాపులర్ అయ్యింది. ఇన్సైడ్ ఎడ్జ్ లో రోహిణి రాఘవన్ పాత్రతో మరింత ఫేమస్ అయింది. వీటన్నింటిని మించి వ్యక్తిగతంగా అమ్మడు నెట్టింట వైరల్ అవుతుంటుంది. తరచూ మహిళల హక్కులు, సామాజిక అంశాల గురించి సోషల్ మీడియాలో గళాన్ని వినిపిస్తుంది. అలాంటి నటి సినిమాల్లోకి వచ్చే క్రమంలో తన తల్లి నుంచి చాలా ఇబ్బందులే ఎదుర్కొంది అన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.



## మృణాల్ మెగా సర్ప్రైజ్

మెగా అభిమానులకు మరోసారి భారీ సర్ప్రైజ్ ఇచ్చే వార్త టాలీవుడ్ లో చక్కర్లు కొడుతోంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ లీడ్ రోల్స్ లో పెద్ది మూవీ రూపొందుతుండగా.. తాజాగా ఆ చిత్రానికి సంబంధించిన మరో ఇంట్రెస్టింగ్ న్యూస్ బయటకు వచ్చింది. యంగ్ అండ్ క్రేజీ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ సినిమాలో స్పెషల్ సాంగ్ లో కనిపించబోతున్నారని ఇప్పుడు వార్తలు వైరల్ అవుతున్నాయి. ఆ పాట భారీ సెట్లు, పెద్ద సంఖ్యలో డ్యాన్సర్లతో స్పెషల్ సాంగ్ ప్రేక్షకులకు విజువల్ ట్రీట్ గా నిలవనుందని టాక్. అయితే స్పెషల్ సాంగ్ పై మూవీ టీమ్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.



సొంత ఆలోచన లేకపోవడం.. పైవాళ్లు తానా అంటే వెనుకుండే వాళ్లు తందానా అనడం చాలా మందిలో కనిపిస్తుంది. ఒకరు చెప్పిన మాటలకు నిజానిజాలు ఆలోచించకుండా, తనకంటూ ఒక సొంత అభిప్రాయం లేకుండా అవును.. అవును అంటూ తల ఊపడం నేటి సమాజంలో చాలా మందిలో కనిపిస్తుంది. కొన్నిసార్లు ఏమీ అర్థం కాకపోయినా, అర్థమైనట్లు నటించేటప్పుడు లేదా ఎదుటివారికి కట్టుబడి వారు చెప్పినదానికల్లా తల ఊపడం. మరికొంత మంది పరిస్థితుల కారణంగా వ్యక్తిత్వాన్ని చంపుకుని తల ఊపాల్సిన సందర్భాలు ఎదురవుతుంటాయి. ఇలా ఎంత మాత్రం చేయొద్దని హితవు పలికింది అందాల ఐశ్వర్యారాయ్. ముఖ్యంగా మహిళలు ఎంత మాత్యరం ఇలాంటి విషయాల్లో వెనక్కి తగ్గొద్దని సూచించారు. మహిళలకు ఉన్న అతిపెద్ద ఆయుధం గొంతుక. ఏదైనా నచ్చనప్పుడు నిర్మొహమాటంగా నో చెప్పండి. ఓపెన్ గా మీ అభిప్రాయాన్ని పంచుకోండన్నారు. అలా చెప్పినప్పుడే మహిళలో శక్తి సామర్థ్యాలు బయటకొస్తాయన్నారు.





## ఒక్క బంతికే 11 పరుగులు!

భారత్ వర్సెస్ న్యూజిలాండ్ రెండో టీ20లో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. న్యూజిలాండ్ బౌలర్ జాక్ ఫోక్స్ ఒక్క బంతికే 11 పరుగులు సమర్పించుకున్నాడు. ఇషాన్ కిషన్ అద్భుతమైన బ్యాటింగ్‌తో పాటు జాక్ ఫోక్స్ ఎక్స్‌ట్రాలు సంధించడంతో ఇది సాధ్యమైంది. ఈ ఓవర్‌లో ఇషాన్ కిషన్ నాలుగు బౌండరీలు, ఒక సిక్స్ బాది 24 పరుగులు పిండుకున్నాడు. ప్రస్తుతం ఈ ఓవర్‌కు సంబంధించిన వీడియో, ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. భారత ఇన్నింగ్స్ సందర్భంగా జాక్ ఫోక్స్ వేసిన మూడో ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ తొలి బంతిని ఇషాన్ కిషన్ ఓవర్ కవర్స్ దిశగా బౌండరీ బాదాడు. అయితే బంతి వేసే క్రమంలో ఫోక్స్.. నాన్ స్ట్రైకర్ స్టంప్స్‌ను పడేసాడు. దాంతో అంపైర్ నోబాల్ ఇవ్వగా.. టీమిండియాకు ఫ్రీహిట్ లభించింది. ఫ్రీహిట్ అడ్డుకోవాలనే ప్రయత్నంలో జాక్ ఫోక్స్ వరుసగా రెండు వైడ్స్ సంధించాడు. మరుసటి బంతిని ఇషన్ కిషన్ లాంగ్ ఆఫ్ దిశగా బౌండరీ తరలించాడు. దాంతో ఒక లీగల్ డెలవరికి 11 పరుగులు వచ్చినట్లు అయ్యింది. అనంతరం మరో వైడ్ వేసిన ఫోక్స్.. తర్వాత రెండు బంతులకు రెండు సింగిల్స్ ఇచ్చాడు. నాలుగో బంతిని బౌండరీ తరలించిన ఇషాన్ కిషన్.. ఐదో బంతిని డాట్ చేశాడు. ఆఖరి బంతిని ఫైన్ లెగ్ దిశగా సిక్సర్ బాది 24 పరుగులు పిండుకున్నాడు.





# ఇషాన్ కేక.. సూర్య కెవ్వు కేక!

## రెండో టీ20లో టీమిండియా విన్

పొట్టి ప్రపంచకప్‌లోపే భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(82 నాటౌట్) ఫామ్ అందుకున్నాడు. టీ20ల్లో తానొక సంచలనమని చాటుతూ రాయ్‌పూర్‌లో న్యూజిలాండ్ బౌలర్లకు తన విధ్వంసాన్ని కళ్లకు కట్టాడు. టీమిండియాపై రికార్డు స్కోర్ కొట్టి విజయంపై ధీమాగా ఉన్న కివీస్ ఆశల్ని ఆవిరి చేస్తూ అర్ధ శతకంతో రెచ్చిపోయాడు.

**ఇషాన్ కిషన్(76) మెరుపు హాఫ్ సెంచరీతో గట్టి పునాది వేయగా.. సూర్య, శివం దూబే(36 నాటౌట్) జోడీ కివీస్ బౌలర్లపై పిడుగల్లే విరుచుకుపడింది. దూబే భారీ సిక్సర్లతో బెంబేలెత్తించగా.. మిస్టర్ 360 తన క్లాస్ ఆటతో ప్రేక్షకులను ఉర్రూతలూగించాడు.**

ఫలితంగా వికెట్ల తేడాతో గెలుపొందిన టీమిండియా.. 2-0తో ఆధిక్యంలో దూసుకెళ్లింది. పొట్టి ఫార్మాట్‌లో భారత జట్టు జోరుకు న్యూజిలాండ్‌కు రెండో ఓటమి తప్పలేదు. 206 పరుగులతో టీమిండియా ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశించినా మ్యాచ్‌ను కాపాడుకోలేకపోయింది కివీస్. 6 పరుగులకే ఓపెనర్లు సంజూ శాంసన్(6) అభిషేక్ శర్మ(0)లు పెవిలియన్ చేరినా.. ఇషాన్ కిషాన్(76) తుఫాన్ ఇన్నింగ్స్ ఆడాడు. దొరికిన బంతిని దొరికినట్టు బౌండరీకి, స్టాండ్స్‌కు పంపిన ఈ చిచ్చరపిడుగు 21 బంతుల్లోనే అర్ధ శతకం సాధించాడు. మరో ఎండ్‌లో సూర్యకుమార్ యాదవ్( 82 నాటౌట్) సైతం పెట్రేగిపోయాడు. 9వ ఓవర్లో 4, 4, 4, 4, 6, 2తో 24 రన్స్ పిండుకున్నాడు. ఏడాది తర్వాత మునపటి సూర్యను తలపించిన అతడు 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇషాన్ ఔటయ్యాక శివం దూబే(36 నాటౌట్) ఉప్పెనలా కివీస్ స్పిన్నర్లను హడలెత్తించాడు. సోఢీ ఓవర్లో అతడు ఏకంగా 100 మీటర్ల సిక్సర్‌తో చెలరేగాడు. ఈ జోడీ విధ్వంసానికి 16.2 ఓవర్లలోనే టీమిండియా మ్యాచ్‌ను ముగించి సిరీస్‌లో 2-0తో ముందంజలో ఉంది. తొలి టీ20లో కంగుతిన్న న్యూజిలాండ్‌కు రాయ్‌పూర్‌లో ఓపెనర్లు డెవాన్ కాన్వే(19), టిప్ సీఫర్ట్(24)లు శుభారంభమిచ్చారు. అర్ష్‌దీప్ సింగ్ ఓవర్లో మూడు ఫోర్లు, సిక్సర్‌తో 18 రన్స్ పిండుకున్నాడు కాన్వే. హర్షిత్ ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లతో చెలరేగాడు సీఫర్ట్. వీరిద్దరి జోరుతో ఓవర్‌కు పది చొప్పున రన్స్ రాగా నాలుగో ఓవర్లోనే స్కోర్ 40 దాటింది. ఈ ద్వయాన్ని రానా విడదీశాడు. కాసేపటికే వరుణ్ ఓవర్లో భారీ షాట్ ఆడాలనుకున్న సీఫర్ట్ .. చేతికి చిక్కాడు. కానీ, రచిన్ రవీంద్ర(44) ఎడాపెడా బౌండరీలతో విరుచుకుపడి గ్లెన్ ఫిలిప్స్ (19)తో కలిసి25 బంతుల్లోనే 50 రన్స్ జోడించారు. డేంజరస్ ఫిలిప్స్‌ను కుల్దీప్ వెనక్కి పంపగా.. వన్డేల్లో దంచిసిన డారిల్ మిచెల్(18)ను శివం దూబె డగౌట్ చేర్చడంతో స్కోర్ వేగం తగ్గింది. అర్ధ శతకానికి చేరువైన రవీంద్రను .. చాప్‌మన్ ఔటయ్యాక కెప్టెన్ శాంట్నర్(47 నాటౌట్) ధనాధన్ ఆటతో దడపుట్టించాడు. డెత్ ఓవర్లలో బౌండరీలతో చెలరేగిన కివీస్ సారథి.. జకరీ ఫౌల్క్స్(15 నాటౌట్)తో కలిసి 19 బంతుల్లోనే 47 రన్స్ జోడించాడు. దాంతో.. భారత్‌పై టీ20ల్లో న్యూజిలాండ్ రికార్డు స్కోర్ చేసింది. ఇదివరకూ 2017లో నమోదు చేసిన 196/2 అత్యధికంగా ఉండేది.

## పశాంత్ వీర్‌కు గాయం..

# సీఎస్‌కేకు షాక్!

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందే చెన్నై సూపర్ కింగ్స్‌కు బిగ్ షాక్ తగిలింది. ఐపీఎల్ 2026 మినీ వేలంలో రూ.14.20 కోట్ల భారీ ధర పెట్టి సీఎస్‌కే కొనుగోలు చేసిన అనామక ప్లేయర్ ప్రశాంత్ వీర్‌కు తీవ్ర గాయమైంది. ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీ 2025-26లో ఉత్తరప్రదేశ్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న ప్రశాంత్ వీర్.. శుక్రవారం జార్ఖండ్‌తో ప్రారంభమైన మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ గాయపడ్డాడు. బౌండరీ వెళ్లకుండా బంతిని ఆపేందుకు ప్రశాంత్ వీర్ డైవ్ చేయగా..అతని కుడి భుజానికి తీవ్ర గాయమైంది. నొప్పితో విలవిలలాడిన ప్రశాంత్ వీర్‌ను ఫిజియోలు మైదానం బయటకు తీసుకెళ్లారు. గాయం తీవ్రత ఎక్కువగా ఉండటంతో అతను కొన్నివారాల పాటు ఆటకు దూరమయ్యే అవకాశం ఉంది. అతని భుజంలో గ్రేడ్-2 చీలిక ఉంటే మూడు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభమయ్యే సమయానికి అతను కోలుకునే ఛాన్స్ ఉంది. అయితే గాయం తర్వాత అతను మునపటిలా సత్తా చాటగలుగుతాడా లేదా అనేది సీఎస్‌కే ఫ్యాన్స్‌కు ఆందోళనగా మారింది. ఐపీఎల్ 2026 మార్చి చివరి వారంలో ప్రారంభం కానుంది. అతి త్వరలోనే ఈ టోర్నీకి సంబంధించిన షెడ్యూల్‌ను బీసీసీఐ అధికారికంగా ప్రకటించనుంది. ఎడమచేతి వాటం స్పిన్ బౌలింగ్, కుడిచేతి వాటం బ్యాటింగ్ చేసే ప్రశాంత్ వీర్ కోసం ఐపీఎల్ 2026 మినీ వేలంలో ఫ్రాంచైజీలు ఎగబడ్డాయి. రాజస్థాన్ రాయల్స్, సీఎస్‌కే, సన్‌రైజర్స్ హైదరాబాద్ పోటాపోటీగా బిడ్ వేసాయి. చివరకు సీఎస్‌కే రూ.14.20 కోట్ల భారీ ధరకు దక్కించుకుంది.

# బాబ్బాబూ.. ఒక్క చాన్స్ ప్లీజ్!

**ఐసీసీకి బంగ్లాదేశ్ బోర్డు మరో లేఖ**

భారత్‌లో టీ20 ప్రపంచకప్ ఆడేందుకు నిరాకరిస్తున్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు షాకిచ్చేందుకు ఐసీసీ సిద్ధమవుతోంది. ఇండియాలో ఆడకుంటే వేటు తప్పదని హెచ్చరించినా బెట్టు వీడని బంగ్లా బోర్డుకు బుద్ధి వచ్చేలా స్కాట్లాండ్‌కు చోటివ్వాలని ఐసీసీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ బోర్డు చిట్టచివరి ప్రయత్నానికి సిద్దమైంది. తమ జట్టుపై వేటును తప్పించుకునేందుకు శుక్రవారం ఐసీసీకి లేఖ రాసింది. వరల్డ్‌కప్ అభ్యంతరాలపై ఐసీసీ వివాదాల పరిష్కార కమిటీ ముందు తమ వాదనను వినిపించేందుకు అనుమతించాలని అత్యున్నత క్రికెట్ మండలిని కోరింది. ఫిబ్రవరి7 నుంచి భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ ఆడడంపై అనిశ్చితికి త్వరలోనే తెరపడనుంది. భద్రతా కారణాలను సాకుగా చూపి ఇండియాకు తమ జట్టును పంపబోమని బెట్టు చేస్తున్న బంగ్లా బోర్డుకు దిమ్మతిరిగే షాక్ ఇవ్వాలనుకుంటోంది ఐసీసీ. ఇప్పటికిప్పుడు షెడ్యూల్ మార్పు కుదరని చెప్పినప్పటికీ బంగ్లాదేశ్ క్రికెట్ సభ్యులు పంతం వీడకపోవడమే అందుకు కారణం. దాంతో, గ్రూప్ సీలోని బంగ్లాదేశ్‌ను తొలగించి.. ర్యాంకింగ్స్ ఆధారంగా స్కాట్లాండ్‌కు అవకాశమివ్వాలని ఐసీసీ అనుకుంటోంది. తమ జట్టుపై వేటు పడనుందని తెలిసిన బంగ్లా బోర్డు చివరి ప్రయత్నంగా ఐసీసీ వివాదాల పరిష్కార కమిటీని ఆశ్రయించనుంది. గ్రూప్ స్వాపింగ్‌కు అనుమతించకపోవడం, భారత్‌లో బంగ్లా జట్టు, సిబ్బంది భద్రతపై తమకున్న ఆందోళనలను ఈ కమిటీ దృష్టికి తేవాలని ఐసీసీకి లేఖ రాసింది. ఇప్పటికే ప్రపంచకప్ షెడ్యూల్‌లో మార్పులకు వ్యతిరేకంగా ఓటింగ్ చేపట్టింది.

# ఒక్క మ్యాచ్‌కే బుమ్రాకు రెస్ట్



ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టీ20కి టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా దూరమయ్యాడు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రాకు ఈ మ్యాచ్ నుంచి విశ్రాంతి కల్పించామని టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ టాస్ సందర్భంగా వెల్లడించాడు. విశ్రాంతి పేరిట బుమ్రాను పక్కనపెట్టడంపై భారత అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క మ్యాచ్‌కే విశ్రాంతి ఏంటని ప్రశ్నిస్తున్నారు. విశ్రాంతి పేరిట బుమ్రాను తప్పించారని మండిపడుతున్నారు. సోషల్ మీడియా వేదికగా టీమ్‌మేనేజ్‌మెంట్ నిర్ణయంపై సెటైర్లు పేల్చుతున్నారు. ఫన్నీ మీమ్స్‌తో నవ్వులు పూయిస్తున్నాయి. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు దూరంగా ఉన్న బుమ్రా.. టీ20 సిరీస్‌లో ఒక్క మ్యాచ్‌కే పక్కన పెట్టడం ఏంటని అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్క్‌లోడ్ మేనేజ్ చేయడానికి బుమ్రా ఎన్ని ఓవర్లు బౌలింగ్ చేశాడని, కేవలం 3 ఓవర్లకే బుమ్రా అలసిపోయాడా అని మండిపడుతున్నారు. వరల్డ్ క్లాస్ పేసర్ బుమ్రాతో వాటర్ మోపించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్యాటింగ్ సామర్థ్యం కలిగిన హర్షిత్ రాణాను ఆడించేందుకు వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ అనే సాకుతో బుమ్రాను తప్పించారని కొందరు క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అక్షర్ పటేల్ గాయంతో జట్టుకు దూరమవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుపుతున్నారు. అక్షర్ స్థానంలో కుల్దీప్ యాదవ్ జట్టులోకి వచ్చాడు. దాంతో బ్యాటింగ్ డెప్త్ లేకుండా పోతుందని గ్రహించిన టీమ్‌మేనేజ్‌మెంట్ బుమ్రాను పక్కనపెట్టి హర్షిత్ రాణాను ఆడిస్తుందని ఆరోపిస్తున్నారు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌తో ఇలానే బుమ్రాను పక్కనపెడితే మ్యాచ్ ప్రాక్టీస్ లేక అతను రిథమ్ కోల్పోయే ప్రమాదం ఉందని మాజీ క్రికెటర్లు హెచ్చరిస్తున్నారు.

ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం www.evarthalu.com
నేటి ఈవార్తలు
శనివారం 24-1-2026

# బాలికలు.. దేశ భవిష్యత్తు



**(నేడు జాతీయ బాలికా దినోత్సవం)**

చదువులో, క్రీడల్లో, అంతరిక్ష పరిశోధనల్లో అమ్మాయిలు అద్భుతాలు సృష్టిస్తున్నారు. అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇంకా అనేక సవాళ్లు మిగిలే ఉన్నాయి. 2026 నాటికి మనం సాంకేతికంగా ఎంతో పురోగతి సాధించినా, కొన్ని ప్రాంతాల్లో లింగ వివక్ష, బాల్య వివాహాలు, పోషకాహార లోపం వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. ఈ సమస్యలను అధిగమించే దిశగా ఏటా జనవరి 24వ తేదీని జాతీయ బాలికా దినోత్సవంగా జరుపుకుంటాం. 2008లో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈ సంప్రదాయాన్ని ప్రారంభించింది. దేశంలో బాలికలు ఎదుర్కొంటున్న వివక్షను అరికట్టడం, వారి హక్కుల పట్ల అవగాహన పెంచడం, వారికి సమాన అవకాశాలు కల్పించడమే ఈ రోజు ప్రధాన ఉద్దేశ్యం. 1966లో ఇదే రోజున ఇందిరా గాంధీ భారత తొలి మహిళా ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఈ రోజుకు మరింత ప్రత్యేకతను చేకూర్చింది. బాలికల సాధికారత కోసం భారత ప్రభుత్వం అనే విప్లవాత్మక పథకాలను తీసుకొచ్చింది. ఆడపిల్లల సంఖ్యను పెంచడం, వారిని విద్యావంతులను చేయడం కోసం బేటీ బచావో - బేటీ పఢావో పథకాన్ని, బాలికల ఉన్నత చదువులు, వివాహం కోసం తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు సుకన్య సమృద్ధి యోజనను, వెనుకబడిన ప్రాంతాల్లోని బాలికలకు నాణ్యమైన వసతితో కూడిన విద్యను అందించేందుకు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు నెలకొల్పింది. కేవలం ప్రభుత్వాలు చట్టాలు చేస్తేనో, పథకాలు తీసుకొస్తేనే సరిపోదు. సామాజిక మార్పు ఇంటి నుంచే మొదలవ్వాలి. ఆడపిల్లలను భారంగా కాకుండా బలంగా చూడాలి. వారికి సరైన పోషకాహారం, నాణ్యమైన వైద్యం, ఉన్నత విద్యను అందించాలి. తమ నిర్ణయాలు తామే తీసుకునేలా వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపాలి. అయితే, గర్భస్థ పిండ నిర్ధారణ పరీక్షలు నిషేధించినప్పటికీ, కొన్ని చోట్ల దొంగచాటుగా జరుగుతూనే ఉన్నాయి. ఇది సమాజంలో లింగ అసమానతలకు దారితీస్తోంది. మహిళలపై జరుగుతున్న అకృత్యాలు తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. దీనివల్ల చాలామంది ఆడపిల్లలను మధ్యలోనే చదువు మానిపిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిలకు స్మార్ట్?ఫోన్లు లేదా ఇంటర్నెట్ సౌకర్యం తక్కువగా ఉంటోంది. 2026 డిజిటల్ యుగంలో ఇది వారి ఎదుగుదలకు ఆటంకంగా మారుతోంది. ఒక అబ్బాయికి చదువు చెబితే ఆ వ్యక్తి మాత్రమే బాగుపడతాడు, కానీ ఒక అమ్మాయికి చదువు చెబితే ఆ కుటుంబమే కాకుండా రాబోయే తరాలు బాగుపడతాయి ఇది అక్షర సత్యం. అభివృద్ధి చెందిన భారత్ కల సాకారం కావాలంటే, అది బాలికల సాధికారత ద్వారానే సాధ్యం. ఆడపిల్లను రక్షించుకుందాం.. వారిని చదివిద్దాం.. నవ భారత నిర్మాణంలో వారిని భాగస్వాములను చేద్దాం.

– ఈవార్తలు సంపాదకీయ విభాగం



# ముంగిట.. మూడోది

**ప్రస్తుత ప్రపంచం ఒక అస్థిరమైన అగ్నిపర్వతం మీద కూర్చుని ఉంది. శాంతి, అభివృద్ధి అనే మాటలు కేవలం నినాదాలకే పరిమితమవుతున్నాయి. గత రెండు శతాబ్దాలలో జరిగిన రెండు ప్రపంచ యుద్ధాలు మానవ చరిత్రలో చెరపలేని గాయాలను మిగిల్చాయి. అయితే, 2026 నాటి ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులను గమనిస్తే, మనం మూడవ ప్రపంచ యుద్ధానికి ప్రమాదకరమైన రీతిలో దగ్గరవుతున్నామా అనే సందేహం కలగక మానదు. నేడు ప్రపంచం రెండు స్పష్టమైన ధ్రువాలుగా విడిపోతోంది.**

ఒకవైపు అమెరికా నేతృత్వంలోని పాశ్చాత్య దేశాలు, మరోవైపు రష్యా-చైనా కూటమి. ఉక్రెయిన్-రష్యా యుద్ధం కేవలం రెండు దేశాల మధ్య పోరుగా మిగిలిపోలేదు. ఇది నాటో వర్సెస్ రష్యాగా రూపాంతరం చెందింది. ఈ సంఘర్షణ ఐరోపా సరిహద్దులను దాటి ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో చైనా తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. తైవాన్‌ను తనలో విలీనం చేసుకోవాలని చైనా చూస్తుండగా, దానికి అడ్డుకట్ట వేస్తామని అమెరికా హెచ్చరిస్తోంది. ఈ ప్రాంతంలో చిన్న నిప్పుకణిక చెలరేగినా, అది ప్రపంచ యుద్ధానికి దారితీసే అవకాశం ఉంది. మూడో ప్రపంచ యుద్ధం అనేది మొదటి రెండు యుద్ధాల మాదిరిగా కేవలం సైనికులు, ట్యాంకులతో మాత్రమే జరగదు. శత్రు దేశాల విద్యుత్ వ్యవస్థలు, బ్యాంకింగ్ నెట్‌వర్క్‌లు, కమ్యూనికేషన్ వ్యవస్థలను సైబర్ దాడుల ద్వారా కుప్పకూల్చడం ద్వారా యుద్ధం ప్రారంభం కావచ్చు. గతంలో ఎన్నడూ లేనంతగా అణు ఆయుధాల ప్రయోగం గురించి బహిరంగ చర్చలు జరుగుతున్నాయి. అణు యుద్ధం అంటే అది మానవాళి వినాశనానికి నాంది. ఉపగ్రహాలను కూల్చివేయడం ద్వారా శత్రువుల కళ్ళు, చెవులను మూసేసే సాంకేతికత నేడు అందుబాటులో ఉంది.

భారతదేశం వసుధైక కుటుంబం అనే సూత్రంతో శాంతిని కాంక్షిస్తోంది. అయితే, పొరుగున ఉన్న చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌తో ఉన్న వివాదాల దృష్ట్యా భారత్ అప్రమత్తంగా ఉండాలి. యుద్ధం వస్తే ప్రపంచ సరఫరా గొలుసు దెబ్బతింటుంది, ఇది భారతదేశ ఆర్థిక వృద్ధిపై ప్రభావం చూపుతుంది. భారత విదేశాంగ విధానం ప్రస్తుతం అగ్రరాజ్యాల మధ్య సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తోంది. అదే పరిస్థితి కొనసాగాలి. ప్రపంచం శాంతి వైపు అడుగులు వేయాలి. యుద్ధం ఎప్పుడూ విజేతలను మిగల్చదు, బాధితులను మాత్రమే మిగిలిస్తుంది. మూడవ ప్రపంచ యుద్ధం సంభవిస్తే అది నాగరికత అంతానికే దారితీస్తుంది. ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలు ప్రేక్షక పాత్రకే పరిమితం కాకుండా, దేశాల మధ్య చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించేలా గట్టి చర్యలు తీసుకోవాలి. సాంకేతికత మానవ కల్యాణానికి ఉపయోగపడాలి కానీ, వినాశనానికి కాదు. భవిష్యత్తు తరాలకు మనం యుద్ధ క్షేత్రాన్ని కాకుండా, శాంతియుతమైన ప్రపంచాన్ని అందించాల్సిన బాధ్యత నేటి నాయకులపై ఉంది.

– ప్రద్యుమ్న సాగరిక

# దారి తప్పిన ఐరాస

**“రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత, 'మరో యుద్ధం రాకూడదు, ప్రపంచం శాంతితో వర్ధిల్లాలి' అనే గొప్ప ఆశయంతో 1945లో ఐక్యరాజ్యసమితి ఆవిర్భవించింది. కానీ ఎనిమిది దశాబ్దాల తర్వాత 2026 నాటి ప్రపంచ పరిస్థితులను చూస్తుంటే, ఈ సంస్థ తన ఉనికిని, ప్రాధాన్యతను కోల్పోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నేటి ప్రపంచంలో ఐక్యరాజ్యసమితి కేవలం చర్చలకు, తీర్మానాలకు పరిమితమైన ఒక ఖరీదైన క్లబ్‌గా మారిందనేది చేదు నిజం. ఐక్యరాజ్యసమితి విఫలమవడానికి ప్రధాన కారణం వీటో అధికారం. ఐదు అగ్రరాజ్యాల (అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్) చేతిలో ఉన్న ఈ అధికారం ప్రపంచ శాంతికి సంకెళ్లు వేస్తోంది.”**




రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మూడేళ్లు దాటినా, ఐరాస కనీసం యుద్ధాన్ని ఆపలేకపోయింది. కారణం-దురాక్రమణకు పాల్పడిన దేశమే భద్రతా మండలిలో శాశ్వత సభ్యురాలిగా ఉండి, తనపై వచ్చే ప్రతి తీర్మానాన్ని వీటో చేయడమే. అలాగే గాజాలో వేలమంది ప్రాణాలు పోతున్నా, అగ్రరాజ్యాల స్వార్థ ప్రయోజనాల వల్ల ఐరాస కేవలం మూగప్రేక్షకుడిలా మిగిలిపోయింది. ఐక్యరాజ్యసమితి స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోలేకపోతోంది. నిధుల కోసం అమెరికా వంటి ధనిక దేశాలపై ఆధారపడటం వల్ల, ఆయా దేశాల రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగానే ఐరాస అడుగులు వేస్తోంది. ఒకప్పుడు బలహీన దేశాలకు అండగా ఉంటుందని భావించిన ఈ సంస్థ, ఇప్పుడు కేవలం అగ్రరాజ్యాల ఆధిపత్య పోరాటానికి వేదికగా మారింది. చైనా వంటి దేశాలు అంతర్జాతీయ చట్టాలను బేఖాతరు చేస్తూ దక్షిణ చైనా సముద్రంలో ఆక్రమణలు చేస్తున్నా, ఐరాస హెచ్చరికలకే పరిమితమైంది. 1945 నాటి ప్రపంచం వేరు, 2026 నాటి ప్రపంచం వేరు. నేడు భారతదేశం వంటి దేశాలు ఆర్థికంగా, వ్యూహాత్మకంగా ఎంతో ఎదిగాయి. కానీ ఐరాసలో సంస్కరణలు అనేవి ఎండమావిలాగే ఉన్నాయి. ప్రపంచ జనాభాలో పెద్ద హిస్సా ఉన్న దేశాలకు నిర్ణయాధికారంలో భాగస్వామ్యం లేకపోవడం ఈ సంస్థ అప్రజాస్వామిక ధోరణికి నిదర్శనం. సంస్థలో మార్పు రానంత కాలం అది ప్రపంచ సమస్యలకు పరిష్కారం చూపదు. ఐరాస సాధారణ అసెంబ్లీలో వందల కొద్దీ తీర్మానాలు ఆమోదం పొందుతాయి. కానీ వాటిని అమలు చేసే అధికారం గానీ, బాధ్యత గానీ ఎవరికీ ఉండదు. పర్యావరణ మార్పులు, ఉగ్రవాదం వంటి గ్లోబల్ సవాళ్లపై మాటల యుద్ధం జరుగుతుందే తప్ప, ఆచరణలో శూన్యం. ఉగ్రవాదులను బ్లాక్ లిస్టులో పెట్టాలన్నా ఏదో ఒక దేశం వీటో చేసి అడ్డుకోవడం ఐరాస బలహీనతకు పరాకాష్ట. ఒక సంస్థ తన ప్రాథమిక లక్ష్యమైన శాంతి స్థాపనలో విఫలమైనప్పుడు, ఆ సంస్థ ఉనికిపై ప్రశ్నలు రావడం సహజం. ఐక్యరాజ్యసమితి ఇప్పుడు ఒక చౌరస్తాలో నిలబడి ఉంది. అయితే అది తనను తాను ప్రక్షాళన చేసుకుని శక్తివంతమైన సంస్థగా మారాలి, లేదా లీగ్ ఆఫ్ నేషన్స్ లాగే చరిత్ర పుటల్లో కలిసిపోవాలి. నేటి ఆధునిక ప్రపంచానికి కావాల్సింది కేవలం ఉపన్యాసాలు ఇచ్చే వేదిక కాదు, అన్యాయాన్ని ఎదిరించే, యుద్ధాన్ని ఆపగలిగే ధైర్యం ఉన్న ఒక అంతర్జాతీయ వ్యవస్థ. ఆ పరిస్థితి లేనందుకే అమెరికా ఐక్యరాజ్యసమితి నుంచి వైదొలిగింది.

– సురేశ్ కుమార్ బోనగిరి


## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811


OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.